ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవీ
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :286 | 09 బుధవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


PJV ప్రజా వీక్షణం టీవీ
Subscribe

## మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా



- కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి
- తనకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ...మిగతా 2 లో...

## ఎమ్మెల్యేలతో చావు రాజకీయాలు చేయిస్తారా?: వేముల ప్రశాంత్ రెడ్డి నిప్పులు



- కేసీఆర్‌ను అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే అని ఆరోపణ
- కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతి కంగా అంతమొందించేందుకు కాం గ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నార ంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేము ల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ...మిగతా 2 లో...

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్



- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరు గనట్లు తప్పించుకోవాలని చూస్తు న్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ...మిగతా 2 లో...

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..
# కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం



- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ...మిగతా 2 లో...



## తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

- తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందన్న స్పీకర్
- బీఆర్ఎస్‌లా సస్పెన్షన్ల సంస్కృతి తమది కాదని స్పష్టీకరణ
- ఈ వ్యవహారంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ (ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు.

...మిగతా 2 లో...

## ప్రధాని మోదీ సభ వేదిక వద్ద
# కలకలం...



- నకిలీ పీఎంఓ ఐడీ, గన్‌తో ఇద్దరు అదుపులోకి!
- ఒకరి వద్ద నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, మరొకరి వద్ద గన్ గుర్తింపు
- ముంబైలోని అంబానీ కల్చరల్ సెంటర్‌లో ఘటన
- భద్రతా డ్రిల్ నిర్వహిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొననున్న ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న కార్యక్రమ వేదిక వద్ద కలకలం రేగింది. నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో భద్రతా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఏసీసీ) వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం జరగనున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2026' ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పోలీసులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ డ్రిల్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా, 24 ఏళ్ల రోహన్ పరేఖ్ అనే వ్యక్తి తనను తాను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డును పరిశీలించగా అది నకిలీదని తేలింది. అదే సమయంలో అతని గన్ మన్ వద్ద ఉన్న తుపాకీని కూడా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.వెంటనే వారిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు, తదుపరి దర్యాప్తు నిమిత్తం ఈ కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. ప్రస్తుతం అధికారులు వారిని ముమ్మరంగా విచారిస్తున్నారు. వారి మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర సామాగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయిన అనంతరం వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని పర్యటనకు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ
# భావోద్వేగం...

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్



గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. ...మిగతా 2 లో...

## కేటీఆర్, హరీశ్ రావుల
# అరెస్ట్...

- మేడ్చల్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపైనే నిరసనకు దిగిన కేటీఆర్, హరీశ్ రావు
- కేసీఆర్‌ను కలిసేందుకు అసెంబ్లీ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు



ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ కీలక నాయకత్వాన్ని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేయడం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి పయనమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేల వాహనాల కాన్వాయ్‌ను మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు బారికేడ్లు పెట్టి నిలిపివేశారు.

...మిగతా 2 లో...

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

- బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసే ఛాలెంజ్
- అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న కోమటిరెడ్డి
- తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్ష



తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ...మిగతా 2 లో...

# తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం" అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# స్పీకర్‌ను బెదిరించే హక్కు హరీశ్‌రావుకు ఎవరిచ్చారు..?

స్పీకర్‌పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు. మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభ నిబంధనలకు కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గోపాల్ రావుపేట రైతు వేదికలో వరి సాగులో రైతులకు సాంకేతిక అవగాహన:

రాముడుగు : ప్రజా వీక్షణం

రామడుగు మండలం గోపాలరావుపేట రైతువేదిక లో వ్యవసాయ శాఖ మరియు ఆత్మ ఆధ్వర్యం లో రికగ్నిషన్ ప్రియర్ లెర్నింగ్ ఆధారిత శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా డా.పి. మధుకర్ రావు సమన్వయకర్త ఉ అధిపతి టీఈరిస్ కరీంనగర్ వారు మాట్లాడుతూ వరి సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు. ముఖ్యంగా కలుపు యాజమాన్యం నీటి యాజమాన్యం పోషక యాజమాన్యం సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) సమగ్ర పోషక యాజమాన్యం (ఐఎన్ఎం)సమగ్ర తెగుళ్ల యాజమాన్యం (ఐడీఎం)సమగ్ర పంట యాజమాన్యం (ఐసీఎం)పద్ధతులను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. పంట దిగుబడిని పెంచడం వనరులను సమర్థవంతంగా వినియోగించడం సుస్థిర వరి సాగును ప్రోత్సహించేందుకు ఈ సాంకేతిక పద్ధతులను రైతులు అవలంబించాలని వారు సూచించారు. యాసంగిలో దుక్కి దున్నకుండా వరి కొయ్యకాలులో మొక్కజొన్న పంట సాగు గురించి ప్రతి రైతు కనీసం తను తినే ఆహారాన్ని పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం లో పండించుకోవాలని అందులోని మెళకువలు పద్ధతులను వివరించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రభావతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు సన్నరకాలు సాగు చేసిన రైతులు ఈ నెల 10 వ తేదీ లోపు సీడ్ డీలర్ వద్ద విత్తనాలు తెచ్చి కున్నట్లయితే డీలర్ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఒకసారి డీలర్ ని సంప్రదించి సరిచూసుకోవాలని ఒకవేళ రైతులు డీలర్ వద్ద కాకుండా స్వంత విత్తనం ఇతర రైతుల నుండి లేక పరిశోధన స్థానాలనుండి(కెవికె, పొలాస,కూనారం) తీసుకువచ్చిన వారు స్వీయ ధ్రువీకరణ పత్రం తో ఏఈఓని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ఈ నెల 10 వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని ఇది ప్రతి రైతు బాధ్యత అని లేని యెడల 500/-బోనస్ వర్తించదని మండల వ్యవసాయ అధికారిని ప్రభావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రావుపేట సర్పంచ్ ఎడవెల్లి వనజ నరేందర్ రెడ్డి ఆత్మ బిటియం శ్రీమతి బి.ప్రవంతి ఏఈఓ టి.అనంతరాజ్ ఏటిఎం సుమాంజలి రైతులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేలతో చావు రాజకీయాలు చేయిస్తారా?: వేముల ప్రశాంత్ రెడ్డి నిప్పులు

మొదటిపేజీ తరువాయి

ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడి నందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పా లని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేటీఆర్, హరీశ్ రావుల అరెస్ట్...

మొదటిపేజీ తరువాయి

వారిని అరెస్ట్ చేసి బోయిన్ పల్లి, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై కేటీఆర్, హరీశ్ రావులు మండిపడ్డారు. శాంతియుతంగా వెళుతున్న తమను ఏ ప్రాతిపదికన అడ్డుకుంటున్నారని నిలదీస్తూ కేటీఆర్, హరీశ్ రావు రోడ్డుపైనే నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేతలను నిరోధించడమే లక్ష్యంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా... ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే శాంతిభద్రతల పరిరక్షణకు విధుల్లో ఉన్నామని పోలీసులు తెలిపారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ఎమ్మెల్యేలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

కమాన్ పూర్ ప్రజా వీక్షణం సెప్టెంబర్ 8.

రామగుండం-3 ఏరియా లోని ఎస్.ఎం.ఎస్ ప్లాంట్ నందు ప్రాజెక్ట్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం ఏరియా లోని వి.కె.ఉపరితల గని (ఓ.సి) కి ప్రాజెక్ట్ ఆఫీసర్ గా బదిలీ పై వెళ్తున్న జి.శంకర్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, వివిధ విభాగాల అధిపతులు మంగళ వారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజనీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, కె.ఐలయ్య , సి.జె.సురేఖ, రవికుమార్, ఆర్.రాజేశ్వరి, ఆసిఫ్ యాసిన్, జ్ఞానసంబంధన్, కోల శ్రీనివాస్, మేఘన,డివై పియం ఎన్. వంశీధర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మెట్ పల్లి లో ఘనంగా విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు

మెట్ పల్లి ( ప్రజా వీక్షణం ) సెప్టెంబర్ 8:

మెట్ పల్లి ఖాది హనుమాన్ మందిరంలో అరవై రెండవ విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సత్యానంద ఆశ్రమం శ్రీ విశోక తీర్థ స్వామి హాజరై ప్రసంగిస్తూ, 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మాన్ని మనం ఆచరిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది. ప్రతి ఒక్కరూ ధర్మరక్షణకు కంకణ బద్ధులై ముందుండాలని వారు కోరారు. వినాయక నవరాత్రులలో భక్తి పాటలు, భజనలు చేయాలని, అశ్లీల పాటలకు తావు ఇవ్వద్దని వారు కోరారు. విశ్వహిందూ పరిషత్ ను 1964 వ సంవత్సరమున శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ద్వితీయ సర్ సంఘచాలక్ పరమ పూజనీయ శ్రీ మాధవరావు సదాశివరావు గోల్ వర్కర్ (శ్రీ గురూజీ) స్థాపించారు. ఈ కార్యక్రమంలో గోనె భూమయ్య , విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పోహార్ తుకారాం, పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ధర్మచార్య సంపర్క్ ప్రముఖ్ మర్రి భాస్కర్, గుంటుక గంగాధర్, ముక్కు నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం...

మొదటిపేజీ తరువాయి

"ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్

మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడూ మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో వీడియోల్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

# 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

# మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

మొదటిపేజీ తరువాయి

గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS
09 బుధవారం సెప్టెంబర్ 2026
3
www.prajaveekshanam.in

# సంపాదకీయం

## పెరుగుతున్న సైబర్ మోసాలు

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎద్దైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రజా మంటలు : అశ్వారావుపేటలో భగ్గుమన్న బీఆర్ఎస్ నిరసన జ్వాలలు !










## - మహిళా ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులు, కాంగ్రెస్ అరాచక పాలనపై కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి, కాసాని పద్మ ఆధ్వర్యంలో హోరెత్తిన మహా ఆందోళనలి

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కక్షసాధింపు రాజకీయాలు రోజురోజుకూ శ్రుతిమించుతున్నాయి. ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా అపహాస్యం చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించడం, కాంగ్రెస్ నాయకులు అసభ్య పదజాలంతో దూషించడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ దుర్మార్గపు చర్యను తీవ్రంగా ఖండిస్తూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అపూర్వమైన రీతిలో, చరిత్రలో నిలిచిపోయేలా భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక పట్టణ ప్రజలు, పార్టీ శ్రేణులు, వేలాదిగా తరలివచ్చిన మహిళా లోకం కదిలివచ్చిన ఈ మహా ఆందోళన కార్యక్రమానికి ప్రముఖ యువ నాయకురాలు, కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి మరియు సీనియర్ నాయకురాలు కాసాని పద్మలు సంయుక్తంగా అగ్రభాగంలో నిలిచి నాయకత్వం వహించారు. వారిద్దరి పట్టుదల, చురుకైన పోరాట పటిమతో ఈ నిరసన కార్యక్రమం విజయవంతమైంది. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి సమర్థ, దూకుడు నాయకత్వంతో ఆందోళనలో ముందుండి నడిచి ప్రభుత్వ ప్రజావ్యతిరేక, అరాచక విధానాలపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. భారత రాజ్యాంగ పీఠం వద్ద వినూత్న నిరసనగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య రక్షణకు డిమాండ్ చేశారు. అశ్వారావుపేట ప్రధాన కూడలిలోని రింగ్ రోడ్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేయడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల వలయాన్ని ఛేదించి ప్రభుత్వ అణచివేత చర్యలను ధీటుగా ఎదుర్కొంటూ గులాబీ శ్రేణుల నినాదాలతో అశ్వారావుపేట ప్రాంతం దద్దరిల్లిపోయింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రముఖ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమైనదని, ఒకవైపు పోలీసులు దురుసుగా ప్రవర్తించగా మరోవైపు కాంగ్రెస్ నాయకులు హద్దు మీరి అసభ్యకరమైన పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్య వ్యవస్థ సిగ్గుపడేలా చేసిందని నాయకులు మండిపడ్డారు. ఈ అక్రమ అరెస్టులు, మహిళా నేతల అణచివేతను తీవ్రంగా ఖండిస్తూ అశ్వారావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో కదం తొక్కాయి. ఈ మహా నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, మహిళా లోకాన్ని ఏకం చేస్తూ ప్రభుత్వ తీరును ఉక్కుపాదంతో అణచివేయాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ ఆమె చేసిన ప్రసంగాలు, ఆందోళన శైలి కార్యకర్తల్లో అంతులేని ఉత్సాహాన్ని నింపాయి. ఈ నిరసన యాత్రలో భాగంగా ముందుగా నాయకులంతా కలిసి భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు భారీ ప్రదర్శనగా చేరుకుని విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి వినతి పత్రం అందజేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే ప్రతిపక్షాల హక్కును కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరు రాజ్యాంగ స్ఫూర్తికే పూర్తిగా విరుద్ధమని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పీఠంలో ఉన్నవారే దానిని అంగూటాల కింద నొక్కుతున్నారని విమర్శించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన అనంతరం, వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు అశ్వారావుపేటలోని అత్యంత రద్దీ ప్రాంతమైన రింగ్ రోడ్ సెంటర్ ప్రధాన కూడలిలోకి దూసుకెళ్లి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టడంతో అశ్వారావుపేట ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసు శాఖకు వ్యతిరేకంగా వారు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పడంతో రంగప్రవేశం చేసిన స్థానిక పోలీసులు ఈ ఆందోళనను భగ్నం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించి నిరసనకారులను చెదరగొట్టేందుకు, రోడ్డు నుంచి పక్కకు లాగేందుకు యత్నించినా, కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి, కాసాని పద్మల గట్టి పట్టుదలతో శ్రేణులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పోలీసుల పటిష్టమైన వలయాలను, బారికేడ్లను సైతం లెక్కచేయకుండా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో అశ్వారావుపేట గడ్డపై నుంచే ప్రజలు తగిన ఘాటైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ప్రతిష్టాత్మక, చారిత్రాత్మక నిరసన కార్యక్రమాన్ని కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి, కాసాని పద్మలు ఎంతో పట్టుదలతో, ఐక్యతతో విజయవంతం చేశారు. ఈ మహా ప్రదర్శనలో మండల నాయకులు భూక్యా ప్రసాద్, జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, ఓగ్గిలా పూజా, సత్యవరపు సంపూర్ణ, గుడవర్తి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సోడెం భారతి, మిద్దిన వెంకట నరసమ్మ, తోట వెంకటమ్మ తదితరులు ముందుండి నడిచి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు భూక్యా ప్రసాద్ రావు,కొనసోతు నవీన్, రహీం మునీషా, ఇస్లావత్ లక్ష్మి, ఆరేపల్లి సౌజన్య, మోటూరి మోహన్, ఎస్ కె రఫీ, శెట్టిపల్లి రఘురాం, బుద్దె పద్మ, జాక్కం బలరాం, జుజ్జురపు రాంబాబు, నార్లపాటి చిన్న అబ్బాయి, గంధం ఆనంద్, బానోత్ ఆదిలక్ష్మి, బానోత్ జ్యోతి, నార్లపాటి అనిల్, కొనసోతు తిరుపతమ్మ, భూక్యా ఉమా, భూక్యా పద్మ, సెగ్గెం రవి, బాలికొండ కిరణ్, అఖిల్, సోమని రమేష్, మందపాటి రవి, రాయల్ భరత్ మరియు అశ్వారావుపేట మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వందలాది మంది మహిళలు, బీఆర్ఎస్ పార్టీ యూత్ లీడర్లు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం..

## పర్యావరణాన్ని కాపాడుదాం

## సుజాత విద్యానికేతన్ హై స్కూల్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**




మట్టి వినాయక విగ్రహాల ను పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆకు తోట శాంతారాం కర్ణ పిలుపునిచ్చారు. హసన్ పర్తిలోని 66వ డివిజన్ కేంద్రంలో పాఠశాల ఆధ్వ ర్యంలో 'మట్టి వినాయకు డిని పూజిద్దాం-- పర్యావర ణాన్ని కాపాడుదాం' కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మట్టి వినాయక ప్రతిజ్ఞ చేయిం చారు. పీఓపీ విగ్రహాలు, రసాయన రంగులతో జలాశయాలు కలుషితమ వుతున్నాయని, అందరూ మట్టి గణపతులను పూజించాలని ప్రిన్సిపాల్ సూచించారు. గత 30 ఏళ్లుగా పాఠశాల ఆధ్వ ర్యంలో ఏటా సుమారు 1,500 మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తు న్నామని తెలిపారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయ ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ప్రపంచ ఫిజియోథేరపీ దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరులో అవగాహన కార్యక్రమం

**పర్చూరు ( బాపట్ల ) : సెప్టెంబర్ 8 ( ప్రజా వీక్షణం )**

మంగళవారం ఉదయం బాపట్ల జిల్లా పర్చూరు మండలం ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో శారీరక కదలికలు తగ్గిపోవడం వల్ల వచ్చే దీర్ఘకాలిక నొప్పులు, గుండె, ఊపిరితిత్తుల జబ్బులు మరియు పక్షవాతం వంటి వ్యాధులను నివారించడంలో ఫిజియోథెరపీ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, కీళ్ల నొప్పులు రాగానే పెయిన్ కిల్లర్స్ వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం లభించినా, కాలక్రమేణా ఇతర దుష్ప్రభావాలు వచ్చే ప్రమాదం ఉందని, కావున దీర్ఘకాలిక కీళ్ల సమస్యల్లో కొద్ది పాటి మందులతో పాటు ఫిజియోథెరపీలోని వ్యాయామాలు, సరైన భంగిమలు, మసాజులు, కరెంటు ద్వారా చచ్చుబడిన నరాలను ఉత్తేజ పరచడం చాలా వరకు మంచి ఫలితం ఉంటుందని, పక్షవాతం బారిన పడినవారు మరియు ఆటిజం వంటి సమస్యతో బాధపడే చిన్నారులకు తగిన ఫిజియోథెరపీ వ్యాయామాల ద్వారా త్వరగా కోలుకుని, స్వతంత్రంగా తమ పనులు తాము చేసుకునే స్థాయికి చేరుకోగలరని, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు ఎక్కువగా వాడే ఉద్యోగులు, విద్యార్థులు పని మధ్యలో చిన్నపాటి విరామం తీసుకుంటూ తేలికపాటి వ్యాయామాలు చేయాలని, రోజూ కనీసం 30 నిమిషాల నడకను ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని, ఉప్పుటూరులో ప్రభుత్వ హోమియో వైద్యశాల నిర్మాణం పూర్తయిన తర్వాత ఒక ఫిజియోథెరపీ విభాగాన్ని కూడా మొదలుపెట్టే దిశగా అందరు ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకురాలు కే.నాగరాజా, వీఆర్వో నాగలక్ష్మి, ఆషా రత్నకుమారి, హాస్పటల్కి వచ్చిన రోగులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.




# హనుమకొండ జిల్లా హసన్ పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా

కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండేలా షిఫ్ట్ల వారీగా విధులు కేటాయించాలని, ప్రతి షిఫ్ట్లో అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండేలా పర్య వేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో తాడిచెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**బాపట్ల : సెప్టెంబర్ 8 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల పట్టణంలోని సర్వే నెంబర్ 67/10 లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా తాడిచెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ,మంగళవారం బాపట్ల తహసీల్దార్ ఎస్ కె సలీమాకు బహుజన సమాజ్ పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గుదే రాజారావు వినతి పత్రం అందించారు.ప్రభుత్వ భూమిలో ఉన్న చెట్లను తొలగించే అధికారం ఎవరికీ లేదని పేర్కొన్నారు.తక్షణమే విచారణ జరిపి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.తహసీల్దార్ కు వినతి పత్రం అందించిన వారిలో బహుజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శీలం రోజన్ బాబు,బీఎస్పీ బాపట్ల మండల అధ్యక్షులు కోపూరి రాజారావు తదితరులు ఉన్నారు.



# స్వామి వారికి సింహాసనం అప్పగింత..

**దేవరకద్ర సెప్టెంబర్ 8 ప్రజావిక్షణం**

మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక శ్రీశ్రీశ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానానికి గతంలో దాదాపు 10 సంవత్సరాల కిందట వీరప్పయ్య స్వామికి సింహాసనాన్ని మారం కిషోర్ లావణ్య దంపతులు సమర్పించారు. అట్టి సింహాసనం రిపేరు వచ్చినందున మరల రిపేరు చేయించి ఇచ్చిన మారం కిషోర్ లావణ్య దంపతులు మరియు కుమారుడు రూపేష్ లకు సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి కృప ఆశీర్వాదాలు ఎల్లవేళలా ఉండాలని అర్చకులు కోరారు.



# మున్సిపల్ ఎన్నికల్లో కేవలం ‘ఒక్క రూపాయికే’ పేదోడికి టిక్కెట్!

**చిలకలూరిపేట : సెప్టెంబర్ 8 ( ప్రజా వీక్షణం )**

రాజకీయాలు అంటే కోటీశ్వరుల ఆట అని,లక్షలు.. కోట్లు ఖర్చు పెడితేనే ఎన్నికల్లో పోటీ చేయగలం అని ఫిక్స్ అయిపోయిన ఈ రోజుల్లో.. సామాన్యుడికి సైతం చట్టసభల తలుపులు తెరిచేందుకు ‘నవతరం పార్టీ’ ఓ అద్భుతమైన అడుగు ముందుకు వేసింది.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సరికొత్త వ్యూహంతో ప్రజల ముందుకు వస్తోంది!

**లక్షలు వద్దు.. ఆ ఒక్క రూపాయి చాలు!**

మున్సిపల్ ఎన్నికల వేళ నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం సంచలన ప్రకటన చేశారు. డబ్బుతో పనిలేని స్వచ్ఛమైన రాజకీయాల కోసం నడుంబిగించిన ఆయన.. ఛైర్మన్, మేయర్, కౌన్సిలర్ లాంటి కీలక పదవులకు కేవలం ‘ఒక్క రూపాయి’ విరాళంగా తీసుకుని నిరుపేదలకు, సామాన్యులకు పార్టీ టిక్కెట్లు (బి-ఫారం) అందిస్తామని ప్రకటించారు.

**డబ్బు లేని రాజకీయం.. మంచి అభ్యర్థులకు స్వాగతం!**

“ఎన్నికలు అంటే నోట్ల కట్టలు పంచిపెట్టడం కాదు, ఓటర్ల కష్టాలు తీర్చే నిజమైన నాయకులను ఎన్నుకునే వేదిక” అని రావు సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. రాజకీయాల్లో ధనప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే, ముందుగా రాజకీయ పార్టీలు మంచి అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజం పట్ల బాధ్యత కలిగిన నిరుపేదలు, యువకులు, సేవాభావం ఉన్నవారు ధైర్యంగా ముందుకు వస్తే.. అన్ని స్థానాల్లోనూ వారిని బరిలోకి దించి వెన్నుదన్నుగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

**సామాన్యుడికి పట్టాభిషేకం..**

**చిలకలూరిపేటలో హాట్ టాపిక్!**

నాయకుడు అవ్వాలనే తపన ఉండి,ప్రజలకు సేవ చేయాలనే ఆశయం ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక వెనుకడుగు వేస్తున్న సామాన్యులకు ఇది నిజంగా సువర్ణావకాశం. నవతరం పార్టీ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా. .చిలకలూరిపేట రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఒక్క రూపాయికే రాజ్యాధికా రం అనే ఈ సరికొత్త నినాదంతో నవతరం పార్టీ ఎంతమంది సామాన్యుల ను నాయకులుగా తీర్చిదిద్దుతుందో వేచి చూడాలి.




# ఆటో కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ కార్మికుల ధర్నా

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)**

ఆటో కార్మికులకు, మోటార్ ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ అనుబంధం మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో మినీ ట్రక్కుల ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియ న్, ఎఐటియుసి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హౌసింగ్ బోర్డు సెంటర్ నుంచి ప్రారంభమైన మినీ ట్రక్కుల ర్యాలీ గొల్లగూడెం సెంటర్ , ఆర్టీసీ డిపో , చెక్ పోస్ట్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాల యానికి చేరింది. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడు తూ ఆటో మోటారు ట్రాన్స్ పోర్ట్ కార్మికు లు, అసంఘటిత రంగ కార్మికుల సంక్షే మం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తా మని ఎన్నికల ప్రణాళికలో కూటమి నేతలు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా వెల్ఫేర్ బోర్డు గురించి ఇంతవరకూ కనీస ప్రస్తావన కూడా రాకపోవడం విచారకరమని, ఇచ్చిన హామీని గుర్తు చేయడానికి రాష్ట్రవ్యాప్త ధర్నాలు చేయాల్సి వచ్చిందని సోమసుందర్ అన్నారు. వాహన మిత్ర పథకాన్ని మినీ ట్రక్కులు, నాలుగు చక్రాల చిన్న రవాణా వాహనాల డ్రైవర్లకు కూడా వర్తింప చేయాలని కోరారు.ఎఐటియుసి ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ బడా పారిశ్రామికవేత్తల వేలకోట్ల రూపాయల బ్యాంకు రుణాలను అడ్డగోలుగా మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు కార్మికుల కోసం కొద్దిపాటి మొత్తాలు ఖర్చు చేయడానికి సైతం ముందుకు రాకపోవడం అన్యాయమని తెలిపారు. బ్యాంకు రుణాల, ఫైనాన్సు సంస్థల అప్పులతో మోటారు ట్రాన్స్ పోర్ట్ కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. వారికి ప్రమాద బీమా, వాహనమిత్ర అమలు చేయాలని డిమాం డ్ చేశారు. రవాణా, పోలీసు శాఖలు తమ టార్గెట్ల కోసమే విచ్చలవిడిగా అధిక మొత్తాలలో చలానాలు విధిస్తూ డ్రైవర్లను వేధిస్తున్నాయనీ, వేధింపులను విరమించు కోని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వీర్రాజు హెచ్చరించారు .ఎఐటియుసి ఏరియా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ లక్షలాది బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఆటో,మోటారు ట్రాన్స్ పోర్ట్ రంగాల కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవా ల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం విచ్చల విడిగా చలానాలు విధిస్తూ డ్రైవర్లను వేధిస్తుందని చెప్పారు. అనుబంధం మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకు లు కర్రి వెంకట సత్యనారాయణ మాట్లా డుతూ ఆటో మినీ ట్రక్కుల కార్మికులు కిరాయిలు లేక, డీజిల్ రేట్లు పెరిగిపో యి, ప్రభుత్వ సహాయం లేక ఇబ్బందులు పడుతున్నారని, తమను ఆదుకునేందుకు తగిన పథకాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారికి తమ సమస్యలపై వినతిపత్రం అందచే శారు. ఈ ధర్నా కార్యక్రమానికి మున్సిప ల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి తాడికొండ శ్రీనివా సరావు, పట్టణ కార్యదర్శి కొడమంచిలి చంద్రరావు, ఉప్పాటి నాగరాజు తదితరు లు మద్దతు తెలిపా రు. అనుబంధం మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్తిశెట్టి అప్పల రాజు, కార్యదర్శి సారిపల్లి అప్పన్న, యూనియన్ నాయకులు కర్రి వెంకటస త్యనారాయణ, వాసంశెట్టి సాయిబాబా, బుంగా రామ్మోహన్, నూజెళ్ల నాగేంద్రకు మార్, చిట్టాల శ్రీనివాసరావు, జామిశెట్టి వెంకటేశ్వరరావు, ఆకుల సాల్మన్ చక్రవర్తి, బనికేల శ్రీను, బడేటి సూర్యచంద్రరావు, గుండాబత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# మెగా డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం: కూటమి ప్రభుత్వ పారదర్శకతకు తిరుగులేదు

**“ నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలి... మెగా డీఎస్సీ ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ 335 పిటిషన్లు వేయించింది” --- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ, సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం):**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. మంగళగిరిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు .రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్ట డంతో పాటు, నిరుద్యోగుల కలలను సాకారం చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సౌమ్య తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకుని కేవలం 148 రోజుల వ్యవధిలోనే 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా విజయవంతంగా ముగించామన్నారు. ఎలాంటి అవకతవకలకు, పైరవీలకు తావులేకుండా పూర్తిగా మెరిట్ ఆధారంగానే నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ఆన్సర్ కీలు, మెరిట్ జాబితాలు, గ్రీవెన్స్ పరిష్కారం మరియు తుది ఎంపిక ప్రక్రియ వరకు ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా అధికారికంగా అందుబాటులో ఉంచామని తెలిపారు. అయితే, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం గిట్టని వైసీపీ, మెగా డీఎస్సీ ప్రక్రియను నిలిపివేయాలని కోర్టుల ద్వారా అనేక ప్రయత్నాలు చేసిందని సౌమ్య ఆరోపించారు. ఇందులో భాగంగానే ఏకంగా 335 పిటిషన్లు దాఖలు చేయించి అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకో వాలని చూశారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నట్టేట ముంచిన ఘనత వైసీపీదేనని విమర్శించారు .రాత్రింబవ ళ్లు కష్టపడి, కళ్లు కాయలు కాచేలా చదివి మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వేలాది మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల కష్టాన్ని తప్పుడు ప్రచారాలతో అవమానించవద్దని ఆమె హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ పారదర్శకత, జవాబుదారీ తనానికే పెద్దపీట వేస్తుందని, చేతకాక కేవలం రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నేతలు అర్థరహిత ఆరోపణలు చేస్తున్నార ని దుయ్యబట్టారు.నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయ క్రీడలు మాని, ఏవైనా ఆరోపణలు ఉంటే తగిన ఆధారాలతో మాట్లాడాలని సౌమ్య వైసీపీకి గట్టి సవాల్ విసిరారు.



## కొత్త ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తుల స్వీకరణపై కమిషనర్ ఏసుబాబు ఆకస్మిక తనిఖీ

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)**

కొత్త ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ప్రత్యేక శ్రేణి కమిషనర్ ఎం.ఏసుబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని 5, 6, 7, 9వ సచివాలయాలను సందర్శించిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ పరిధిలోని స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు రైస్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం సంబంధిత పెన్షన్ కేటగిరీకి అవసరమైన ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. దివ్యాంగుల పెన్షన్ కోసం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు నిర్ధారించే సదరం ధృవపత్రం ఉండాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సెప్టెంబర్ 16వ తేదీలోగా తమ పరిధిలోని సంబంధిత సచివాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ ఏసుబాబు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.



## ఆపదలో శక్తి యాప్ అండ.. బాలికల భద్రతకు భరోసా

### తాడేపల్లిగూడెం రూరల్ సీఐ శ్రీనివాసరావు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)**

ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు తమ భద్రతపై అవగాహనను కలిగి ఉండటంతోపాటు ఎలాంటి సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని తాడేపల్లిగూడెం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు సూచించారు. ఆపద సమయంలో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకుని పోలీసుల సహాయం పొందాలన్నారు. పెంటపాడు మండలంలోని పెంటపాడు డీఆర్‌గోయెంకా జూనియర్ కళాశాలలో మంగళవారం మహిళల భద్రత, ర్యాగింగ్ నిరోధక చట్టం, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టంపై విద్యార్థులకు ఆయన అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా పోలీసులను ఎలా సంప్రదించాలి, అత్యవసర పరిస్థితుల్లో యాప్ ఏ విధంగా రక్షణ కల్పిస్తుందనే విషయాలను విద్యార్థినులకు తెలియజేశారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా ఎదురయ్యే పరిణామాలు, విధించే శిక్షలతోపాటు బాలికలపై వేధింపులు, లైంగిక దాడులను అరికట్టేందుకు అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు, తోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని దేవరకద్ర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు..

**దేవరకద్ర సెప్టెంబర్ 8, ప్రజావి క్షణం**

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి.కేసీఆర్ చనిపోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా జీవితంలో ఉన్న ఒక ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం దేవరకద్ర మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.దేవరకద్ర పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్ఐ భాస్కర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు ,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,అలాగే ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని,రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా దూషించడం లేదా మరణాన్ని కోరుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.తమ ఫిర్యాదుపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరిన బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్,సింగిల్ విండో చైర్మన్ డోకూర్ నరేందర్ రెడ్డి,రవీందర్ రెడ్డి,కొండా రెడ్డి, మధు,కొండల్,సిరాజ్, యాదయ్య,అడ్డు,ఆంజనేయులు మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి మూకమామిడిలో వినూత్నంగా వార్డు సభలు!






### సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ప్రత్యేక శ్రీకారం.. ప్రజల ముంగిట్లోకి పాలన

**ములకలపల్లి, సెప్టెంబర్ 8:(ప్రజా వీక్షణం)**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను మూలాల నుంచి తెలుసుకునేందుకు మూకమామిడి గ్రామ పంచాయతీ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్' (విజిపిపి)లో భాగంగా కేవలం కార్యాలయానికే పరిమితం కాకుండా, నేరుగా ప్రతి వార్డులోకి వెళ్లి వార్డు సభలు నిర్వహించి సరికొత్త ఒరవడి సృష్టించారు.అలాగే "గ్రామసభ అంటే ప్రజలు మా దగ్గరకు రావడం.. వార్డు సభ అంటే మేమే ప్రజల దగ్గరకు వెళ్లడం" అనే నినాదంతో సర్పంచ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రతి వార్డులోనూ స్వయంగా పర్యటించిన నాయకులు.. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, పింఛన్లు మరియు ఇళ్ల సమస్య లపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రజల నుండి నేరుగా అర్జీలు, వినతులను స్వీకరించి వాటిని అధికారిక రిజిస్టర్లలో నమోదు చేయించారు.ఈ వార్డు సభల ద్వారా సేకరించిన ప్రతి సమస్యను రాబోయే మూడు సంవత్సరాల 'విజిపిపి' అభివృద్ధి ప్రణాళికలో చేర్చి దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్ కుమార్, టి.ఏ తాటి సత్యం, వార్డు సభ్యులు కణితి చిన్న వెంకటేశ్వర్లు, కిసారి రాజ్ కుమార్, తనం పావని, కోర్సా శ్రీకృష్ణ, బచ్చల చైతన్య కుమారి, ఉపాధి హామీ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు కీసరి గోపయ్య, బాబురావు, గడ్డం బాబు, సవలం సత్యనారాయణ, ఎస్.కె అబ్దుల్లా, పున్నం వెంకన్న తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుక్కునూరులో హోరెత్తిన ఉద్యోగుల గళం..

### కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సచివాలయ ఏ.ఎన్.ఎం.ల సంఘీభావం

**కుక్కునూర్, సెప్టెంబర్ 08:(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా కుక్కునూర్ మండలంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తెరపైకి వచ్చాయి. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ మరియు నూటికి నూరు శాతం పూర్తి వేతన డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా జోరందుకున్న ఉద్యమ గళానికి కుక్కునూర్ ప్రాంతంలో మద్దతు లభించింది. ఆదివాసీ వైద్య మరియు ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో, రాష్ట్ర సంయుక్త కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు కుక్కునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మంగళవారం నాడు నిరసన కార్యక్రమం చేపట్టారు.
ఈ శాంతియుత నిరసనలో స్థానిక సచివాలయ ఏ.ఎన్.ఎం.లు సైతం స్వచ్ఛందంగా భాగస్వామ్యులై నల్ల బ్యాడ్జీలను ధరించి తమ నిరసనను, సంఘీభావాన్ని ప్రకటించారు. తమకు న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉద్యోగులు స్పష్టం చేశారు.అలాగే ఇటీవల సెప్టెంబర్ 3న విజయవాడ సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఉద్యోగుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి, సరిగ్గా నెల రోజుల గడువులోగా సానుకూల నిర్ణయం ప్రకటిస్తామని మంత్రి హామీ ఇచ్చిన విషయం



తెలిసిందే.ప్రభుత్వం నుండి అధికారికంగా స్పష్టమైన నిర్ణయం వచ్చేంత వరకు ఏజెన్సీ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆందోళనను తీవ్రతరం చేయాలని సంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగానే రానున్న ముప్పై రోజుల పాటు ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల అంతర్జాల పనులను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు ఆదివాసీ వైద్య మరియు ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు కె. ముత్యాలమ్మ, పి. నాగరాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ హామీలు అమలయ్యే వరకు శాంతియుత మార్గంలోనే తమ నిరసన ప్రదర్శనలు నిరంతరం కొనసాగుతాయని వారు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో సచివాలయ ఏ.ఎన్.ఎం.లు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా టి. భూలక్ష్మి, పి. కృష్ణవేణి, ఎం. సీత, పి. ఉషారాణి, కె. సుశీల తదితరులు నల్ల బ్యాడ్జీలతో నిరసనలో పాల్గొన్నారు. వీరితో పాటు ఆశా కార్యకర్తలు నాగమణి, రమణ, మాధవి తదితరులు హాజరై తమ సంఘీభావాన్ని తెలియజేసారు. ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య ఆరోగ్య శాఖలో నెలకొన్న ఈ పరిణామాలు స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## సమీకృత గురుకుల పాఠశాలకు ప్రభుత్వ భూమిని కేటాయించాలి....






### జె ఎ సి ఆధ్వర్యంలో దీక్ష...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేసింది.ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం వెచ్చిస్తోంది. కావున, పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో మంజూరైన ఈ సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 61లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి కేటాయించవచ్చు. అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి 25 ఎకరాల భూమిని తక్షణమే రెవెన్యూ శాఖ అధికారులు సర్వే ద్వారా గుర్తించి, దానికి సంబంధించిన మ్యాప్‌ను సిద్ధం చేసి అందజేయాలి.ఈ విధంగా సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు అవసరమైన 25 ఎకరాల ప్రభుత్వ భూమిని త్వరితగతిన గుర్తించి కేటాయిస్తే, పెంచికల్‌పేట్ మండలంతో పాటు చుట్టుపక్కల ఉన్న మండలాలు, సమీప గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. వారి విద్యాభివృద్ధికి ఇది ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తుంది.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం వెచ్చిస్తోంది.పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో మంజూరైన ఈ సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 61లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి కేటాయించవచ్చు. అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి 25 ఎకరాల భూమిని తక్షణమే రెవెన్యూ శాఖ అధికారులు సర్వే ద్వారా గుర్తించి, దానికి సంబంధించిన మ్యాప్‌ను సిద్ధం చేసి అందజేయాలి.ఈ విధంగా సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు అవసరమైన 25 ఎకరాల ప్రభుత్వ భూమిని త్వరితగతిన గుర్తించి కేటాయిస్తే, పెంచికల్‌పేట్ మండలంతో పాటు చుట్టుపక్కల ఉన్న మండలాలు, సమీప గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. వారి విద్యాభివృద్ధికి ఇది ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తుంది 200 కోట్ల రూపాయలతో మంజూరైన ప్రభుత్వ సమీకృత గురుకుల పాఠశాలను పెంచికల్ పేట్ మండల కేంద్రం లోనే నిర్మించాలి.సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని రెవెన్యూ శాఖ ప్రభుత్వ వెంటనే గుర్తించాలనీ ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ (ఎ టీ ఎస్ యు) కన్వీనర్ సుంపుటం సాయికిరణ్ డిమాండ్ చేశారు.

# పెంటపాడు కాపుల రామాలయానికి మహర్దశ

### ఆలయ పునర్నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు

### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం):**

పెంటపాడు మండలం పెంటపాడు గ్రామంలోని ఊర చెరువు వద్ద ఉన్న కాపుల రామాలయానికి మహర్దశ పట్టనుంది. పురాతన ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ. 40 లక్షల గ్రాంట్ మంజూరు చేయడంతో ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నిధుల మంజూరు ఉత్తర్వులు ఇప్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయన వ్యక్తిగత సహాయకులు దారపురెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక శిబిర కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ. 40 లక్షల నిధులు మంజూరు కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. పురాతన కాపుల రామాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో, భక్తులకు మరింత అనుకూలంగా పునర్నిర్మించేందుకు ఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు దారపురెడ్డి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు చామన సురేష్, కొత్తపల్లి శేషు, పాలూరి శేషగిరి, పిండి నాగరాజు, శీలంసెట్టి రామచంద్రరావు, పంచకర్ల పూర్ణచంద్రరావు, నాగిరెడ్డి నాగేశ్వరరావు, గంటా నాగవేణు సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణ్ రెడ్డి, కోనగళ్ల హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార మహోత్సవం -- 2026...మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం -- 2026 సందర్భంగా కాగజ్‌నగర్ మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార మహోత్సవాన్ని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి ఉజ్వల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ మరియు జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ గారు కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి, పురస్కారాలు అందజేశారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాధితుని పరామర్శించిన నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి..

**దేవరకద్ర సెప్టెంబర్ 8 ప్రజా విక్షణం**

దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలనికి సంబంధించిన యువ నాయకుడు వనపర్తి జిల్లా బీజేవైఎం మాజీ ప్రధాన కార్యదర్శి బిట్లి రాజశేఖర్, నిన్న హైదరాబాదు ఇందిరా పార్క్ వద్ద స్కాలర్ షిప్ఢ ఫీజు రీయింబర్స్ మెంట్ సమస్యలపై భారతీయ జనతా మోర్చా మరియు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నా లో పోలీసుల తోపులాటఢ లాటి ఛార్జ్ లో తీవ్రంగా అస్తవ్యస్త కు గురయ్యారు. రాజశేఖర్ కి అప్రెండేక్స్ చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, మంగళవారం హైదరాబాదులో గాంధీ హాస్పిటల్ లో రాజశేఖర్ ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలనిఆయన కోరారు.



# ఎస్‌పీఎం కార్మికుల రిలే నిరాహార దీక్షలు 112వ రోజు..

### గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలి..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని సిర్పూర్ పేపర్ మిల్ (ఎస్‌పీఎం)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 112వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు దీక్షలో కూర్చున్నవారు అబ్దుల్ నబి గారు మద్దతుగా కూర్చున్నవారు వెంకటేశు షబ్బీర్ రాజన్న మల్లేష్ ఏ కేసింగ్ తదితరులు మద్దతుగా కూర్చున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి, కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరిపి వేతన ఒప్పందం చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. 112 రోజులు దాటినా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం, ఎస్‌పీఎం యాజమాన్యం స్పందించి వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.




# ఆర్టీసీ పరిరక్షణకు ఉద్యోగులు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి

### ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా కార్యదర్శి బి.తిరుమలరెడ్డి

**బాపట్ల : సెప్టెంబర్ 8 ( ప్రజా వీక్షణం )**

ఆర్టీసీని కాపాడుకోవడానికి ఉద్యోగులు కార్మికులు ఆర్టీసీ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా నెల్లూరు-2 డిపో పరిధిలో కొనసాగుతున్న దీక్షలకు మద్దతుగా మంగళవారం బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ నీ ప్రైవేట్ పరం చేయొద్దని కోరుతూ ప్రజాప్రయోజనాల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా బాపట్లలో ఈ దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పరిరక్షించేందుకు ఆర్టీసీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు తిరుమలరెడ్డి తెలిపారు. ప్రజా రవాణా సేవలను బలోపేతం చేయాలంటే ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ పరిధిలోనే నిర్వహించాలని, ప్రైవేటీకరణకు అవకాశం కల్పించకుండా ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, సిబ్బంది కొరతను నివారించాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా అవసరమైన బస్సులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆర్టీసీ ప్రయోజనాల పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీక్ష శిబిరంలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన వారిలో స్టాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తిరుమలరెడ్డితోపాటు జిల్లా అధ్యక్షులు నారాయణ, జిల్లా కోశాధికారి బి. శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కార్యదర్శి ఎస్. యోగానంద్, సిఐటియు బాపట్ల నాయకులు కె. శరత్ నిరాహార దీక్షలో ఉన్నారు. దీక్షకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వై. భాస్కరరావు, సిఐటియు సీనియర్ నాయకులు కె.నాగేశ్వరరావు, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు సత్యనారాయణలు ప్రారంభించారు ఉదయం ప్రారంభమైన శిబిరం సాయంత్రం ఐదు గంటలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు వసంతరావు,అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్, ఎల్ఐసి జిల్లా నాయకులు రవికిరణ్, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు శ్రీనివాస్,చారి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం వీరితోపాటు మరికొన్ని ప్రజాసంఘాలు ఆర్టీసీ ఉద్యోగ కార్మిక సంఘాలు మద్దతు తెలిపారు. అనంతరం దీక్ష శిబిరంలో పాల్గొన్న వారికి నిమ్మరసం అందించి రిలే నిరాహార దీక్షను విరమింప చేశారు.




# డప్పు కళాకారుల పింఛన్లకు జీవో అడ్డంకి

### దరఖాస్తు గడువు నెల రోజులు పొడిగించాలి

### దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)**



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన జీవో నిబంధనలు దళిత డప్పు కళాకారులు, చర్మకారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అడ్డంకిగా మారా యని దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరా వు అన్నారు. మంగళవారం విడుద ల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు దరఖా స్తులను స్వీకరించడం లేదని ఆరోపిం చారు. సాంఘిక సంక్షేమ శాఖ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనతో అర్హులైన పేద కళాకారులు పింఛన్లకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత పదేళ్లుగా సాంఘిక సంక్షేమ శాఖ చర్మకారు లు, డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయలేదని తెలిపారు. గతంలో సంఘాల రిజిస్ట్రేషన్ ఆధారంగా గుర్తింపు కల్పించి పింఛన్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు, అవసరమైన ధ్రువపత్రాల కొరతతో పలువురు అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిబంధనలను సడలించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ గడువును మరో నెల రోజులు పొడిగించాలని కోరారు. చర్మకారులు, డప్పు కళాకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని లక్ష్మణరావు హెచ్చరించారు.

# శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీ చింతమనేని శ్రీనివాస్, ఐపీఎస్ సమావేశం

### ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో

**పటాన్ చేరు : సెప్టెంబర్ 8 (ప్రజావీక్షణం)**

ఈరోజు బొల్లారం ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీ చింతమనేని శ్రీనివాస్, ఐపీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి నిరంతర పర్యవేక్షణతోపాటు కంపెనీలలో పనిచేస్తున్న వలస కార్మికుల వ్యక్తిగత వివరాలు, వారి పూర్వ చరిత్ర (యాంటిసిడెంట్స్)ను తప్పనిసరిగా ధృవీకరించుకోవాల్సిన అవసరాన్ని డీసీపీ గారు వివరించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పోలీసులకు సహకరించాలని పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడీఏ బొల్లారం సీఐ వి. సుధీర్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ రావు, కార్యదర్శి రాయుడు, మైలాన్ కంపెనీ యాజమాన్య ప్రతినిధులు మరియు ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.





# అంబేద్కర్ సాక్షిగా హెచ్చరిక

### దళిత స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు సహించం కాటా సుధారాణి

**పటాన్‌చెరు : సెప్టెంబర్ 8 (ప్రజావీక్షణం)**

రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను కించపరిచేలా తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకురాలు కాటా సుధారాణి అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించేలా ఉన్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. రాజ్యాంగ పదవులను అవమానించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు .బాధ్యతాయుతమైన రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు కూడా హద్దు ఉండాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాటా సుధారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, పటాన్‌చెరు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యేపూరి శివానందం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# భద్రాద్రి జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా అనూష

### - ఉత్తర్వులు విడుదల చేసిన కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 8(ప్రజా వీక్షణం):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గ్రూప్-1 అధికారిణి అనూషకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భద్రాద్రి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం అనుషను నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించి వాటి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తూ పర్యాటక అభివృద్ధికి నోడల్ అధికారి పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పర్యాటక అధికారిగా ఉన్న పరాధామ రెడ్డి జిల్లా యువజన క్రీడల అధికారిగా కొనసాగనున్నారు.

# యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్న మత్తు మాఫియాపై జంగారెడ్డిగూడెం పోలీసుల ఉక్కుపాదం!

## జంగారెడ్డిగూడెంలో భారీ మత్తు ఇంజెక్షన్ల రాకెట్ గుట్టురట్టు:....ఐదుగురు నిందుతులు అరెస్ట్ సతీష్, దుర్గాప్రసాద్, రాజేష్, చిరంజీవి, శివకృష్ణల అరెస్ట్ - 880 ట్రమడాల్ యాంపుల్స్ స్వాధీనం!

**జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో యువతను పెడదోవ పట్టించి, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న భారీ మత్తు ఇంజెక్షన్ల అంతరాష్ట్ర రాకెట్‌ను జంగారెడ్డిగూడెం పోలీసులు మరియు డ్రగ్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా భగ్నం చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ మరియు సరైన కొనుగోలు బిల్లులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా రహస్యంగా మత్తు ఇంజెక్షన్లను విక్రయిస్తున్న ఈ బాగోతం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 880 ట్రమడాల్ మత్తు యాంపుల్స్‌ను జంగారెడ్డిగూడెం పోలీసులు స్వాధీనం చేసుకుని, ప్రధాన నిందితులైన సతీష్, దుర్గాప్రసాద్, రాజేష్, చిరంజీవి, శివకృష్ణలను పక్కా ఆధారాలతో అరెస్ట్ చేశారు. ఈ అక్రమ దందా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు తొలుత స్థానిక రైతుల ద్వారా సమాచారం వెలుగులోకి వచ్చింది. పామాయిల్ తోటలో వందలాదిగా వాడేసిన ట్రామడాల్ ఇంజెక్షన్లు, సిరంజిలు కుప్పలు కుప్పలుగా పడి ఉండటాన్ని స్థానిక రైతులు గుర్తించారు. ఈ దారుణ దృశ్యాన్ని చూసి కంగుతిన్న రైతులు వెంటనే డ్రగ్ కంట్రోల్ అధికారులకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే డ్రగ్ ఇన్స్పెక్టర్ పి.మల్లిఖార్జునరావు, ఏలూరు డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎం.విక్రమ్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు ఆ తోటను పరిశీలించాయి. అక్కడ లభించిన సిరంజిలు, యాంపుల్స్ బ్యాచ్ నంబర్ల ఆధారంగా లోతైన విచారణ ప్రారంభించడంతో ఈ భారీ మత్తు రాకెట్ గుట్టు ఒక్కొక్కటిగా వీడియింది. ఈ ఘటనపై ఇదివరకే నమోదైన కేసు దర్యాప్తును జంగారెడ్డిగూడెం పోలీసులు మరింత వేగవంతం చేశారు. అధికారులు లక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ, విరూప పెద్దింటి మెడికల్ ఏజెన్సీలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఒకే ఏజెన్సీకి హైదరాబాద్ నుంచి కేవలం 3 నెలల వ్యవధిలోనే దాదాపు 20 వేల ట్రామడెక్స్ ఇంజెక్షన్లు దిగుమతి అయినట్లు అధికారులు గుర్తించారు. అయితే, ఇందుకు సంబంధించిన సరైన కొనుగోలు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లలో ఎలాంటి పొంతన లేకపోవడంతో అధికారులకు అనుమానాలు బలపడ్డాయి. ఈ కేసులో గతంలోనే లక్ష్మీ శ్రీనివాస ఏజెన్సీ నిర్వాహకుడు కిషోర్‌ను అరెస్ట్ చేసి, డాంగేనగర్ లోని ఒక వుడ్ కార్వింగ్ వర్క్ షాప్ లో దాచి ఉంచిన 7,550 ఇంజెక్షన్లను సీజ్ చేయడం గమనార్హం. తాజాగా 7వ తేదీన సోమవారం నాడు ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జంగారెడ్డిగూడెం పట్టణ ఇన్స్పెక్టర్ సుభాష్, ఎస్సై ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై కుటుంబరావు మరియు వారి పోలీస్ సిబ్బంది స్థానిక పలు మెడికల్ షాపులు, ఏజెన్సీలలో ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎలాంటి అనుమతులు లేకపోయినా, అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్థాలను నిల్వ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 880 ట్రమడాల్ మత్తు యాంపుల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో హైదరాబాద్‌కు చెందిన 'ట్రమడిక్ష్' కంపెనీకి చెందిన 780




యాంపుల్స్ ఉండగా, గుజరాత్‌కు చెందిన మరో 100 యాంపుల్స్ ఉన్నాయి. నిందితులు యువత బలహీనతలను ఆసరాగా చేసుకుని ఈ దందా సాగిస్తున్నట్లు విచారణలో తేలింది. అసలు మార్కెట్లో కేవలం రూ. 5 మాత్రమే విలువ చేసే ఈ ప్రాణాంతక ట్రమడాల్ ఇంజెక్షన్‌ను, నిందితులు అమాయక యువతకు రూ. 20 నుంచి రూ. 50 వరకు అధిక ధరలకు రహస్యంగా విక్రయిస్తూ అందినకాడికి దోచుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దీనివల్ల యువత క్షణికావేశంలో ఈ మత్తుకు బానిసలై, తమ విలువైన ప్రాణాలను, భవిష్యత్తును రోడ్డున పడేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సహకరిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు పక్కా వ్యూహంతో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు: 1. సతీష్ – ఏలూరులోని 'జ్యోతిక ప్రెగ్నెంట్ ఏజెన్సీ' మెడికల్ షాపు ఉద్యోగి, 2. దుర్గాప్రసాద్ – ఏలూరులోని 'రూప ప్రెగ్నెంట్ ఏజెన్సీ' మెడికల్ షాపు ఉద్యోగి, 3. రాజేష్ – వివిధ మెడికల్ ఏజెన్సీలలో హెల్పర్‌గా పనిచేస్తున్న వ్యక్తి, 4. తమ్మిశెట్టి చిరంజీవి – టి.నరసాపురం మండలం మధ్యాహ్నపు వారి గూడెంలో 'చిరు మెడికల్స్' నిర్వహిస్తున్న నిర్వాహకుడు, 5. శివకృష్ణ – 'భవాని మెడికల్స్' నిర్వహిస్తున్న నిర్వాహకుడు. అరెస్టు చేసిన ఐదుగురు నిందితులను విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకుని, తదుపరి చట్టపరమైన చర్యల కోసం కోర్టులో హాజరుపరచనున్నట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నార్కోటిక్ మందులు, మత్తు ఇంజెక్షన్ల వ్యాపారం చేస్తే ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిందితులపై కఠినమైన ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ రాకెట్‌కు సంబంధించి స్థానికంగానే కాకుండా, తెలంగాణలోని అశ్వారావుపేట ప్రాంతం వరకు ఏవైనా అక్రమ సరఫరాలు జరిగాయా అనే కోణంలో పోలీసులు మరియు ప్రత్యేక 'ఈగల్' బృందం మరింత లోతుగా కూపీ లాగుతోంది. ఈ నెట్‌వర్క్‌లో ఉన్న మిగతా వ్యక్తుల వివరాలను కూడా త్వరలోనే వెల్లడించి అరెస్ట్ చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు, ఇంజెక్షన్ల బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై, ప్రవర్తనపై నిరంతరం కన్నేసి ఉంచాలని జంగారెడ్డిగూడెం పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పదేళ్లు గడిచినా మారని కార్యాలయ బోర్డు

- పశుసంవర్ధక శాఖలో అధికారుల నిర్లక్ష్యం
- ఆర్టీఐ చట్ట నిబంధనల అమలుపైనా నిర్లక్ష్యమే
- అసహనం వ్యక్తపరచిన పొన్నెకంటి సంజీవరాజు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 8(ప్రజా వీక్షణం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడి దాదాపు పదేళ్లు గడుస్తున్నా.. జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మాత్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆనవాళ్లు తొలగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఆరోపించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద ఇప్పటికీ గత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన బోర్డు దర్శనమిస్తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన జరిగి ఇంతకాలం గడిచినా కార్యాలయ బోర్డుపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరును సూచించకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నించేలా ఉందన్నారు. సహాయ సంచాలకుల కార్యాలయం మొదటి అంతస్తులో కొనసాగుతుండగా కింది భాగంలో పశువుల ఆసుపత్రి నిర్వహిస్తున్నారని సంజీవరాజు తెలిపారు. అయితే ఆసుపత్రికి కనీసం బోర్డు కూడా లేకపోవడం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించే విధంగా వివరాలు ప్రదర్శించకపోవడం పట్ల ఆయన ఆక్షేపించారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం--2005కు సంబంధించి అప్పిలేట్ అధికారి, సహాయ అప్పిలేట్ అధికారి పేర్లు, నోటీస్ బోర్డు, కార్యాలయ సిబ్బంది వివరాలు వంటి కీలక సమాచారాన్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉంచలేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరుతో నూతన బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు పశువుల ఆసుపత్రికి ప్రత్యేక బోర్డు ఆర్టీఐ చట్టానికి సంబంధించిన అధికారుల వివరాలు నోటీస్ బోర్డు సిబ్బంది వివరాలను ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలని పొన్నెకంటి సంజీవరాజు కోరారు. అధికారుల నిర్లక్ష్యానికి ముగింపు పలికి ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని ఆయన డిమాండ్ చేశారు.




# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రతిపాదిత స్థలాల పరిశీలన

- తిమ్మంపేటలో పరిశీలనను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్
- పరిశీలన వివరాలను కలెక్టర్‌కు వివరించిన బృంద సభ్యులు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 8(ప్రజా వీక్షణం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం రెండు రోజులుగా జిల్లాలోని ప్రతిపాదిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ విమానాశ్రయ ఏర్పాటుకు అనుకూలతపై వివిధ సాంకేతిక అంశాలను అధ్యయనం చేస్తోంది. మంగళవారం ములకలపల్లి మండలం తిమ్మంపేటలో జరుగుతున్న సాంకేతిక పరిశీలనను ఏఏఐ బృంద సభ్యులతో కలసి జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యవేక్షించారు. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భౌగోళిక భౌతిక సాంకేతిక ప్రమాణాలను పరిశీలించేందుకు ఏఏఐ సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టింది.ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండి ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత ప్రాంతాల్లో భూమి స్వభావం ఎత్తుపల్లాలు కొండలు కొండచరియలు అటవీ ప్రాంతాలు నీటి ప్రవాహ మార్గాలు రహదారులు రైల్వే మార్గాలు విద్యుత్ లైన్లు తదితర అంశాలను పరిశీలించింది. విమానాశ్రయానికి అత్యంత కీలకమైన రన్‌వే ఏర్పాటుకు అవసరమైన ప్రాంతం విమానాల రాకపోకలకు సంబంధించిన అప్రోచ్ ప్రాంతం పరిసరాల్లో ఉన్న అడ్డంకులు తదితర అంశాలపై కూడా సాంకేతికంగా అంచనా వేసింది. గతంలో ప్రతిపాదించిన ప్రాంతాలకు



సంబంధించి మ్యాప్‌ల ఆధారంగా సుమారు 500 ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించినప్పటికీ విమానాశ్రయానికి అవసరమైన రన్‌వే అప్రోచ్ ఇతర అనుబంధ సౌకర్యాల దృష్ట్యా అదనపు ప్రాంతాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సాంకేతిక బృందం తెలిపింది. ముఖ్యంగా అప్రోచ్ ప్రాంతానికి సుమారు 1.5 కిలోమీటర్ల వరకు అదనపు స్థలం అవసరమయ్యే అవకాశాలను కూడా బృందం పరిశీలిస్తోందని తెలిపారు. కొన్ని ప్రతిపాదిత ప్రాంతాల్లో రైల్వే మార్గం సమీపంలో ఉండటాన్ని కూడా సాంకేతిక బృందం పరిశీలించింది. సత్తుపల్లి గూడ్స్ రైల్వే లైన్ ప్రతిపాదిత ప్రాంతానికి సుమారు 100 నుంచి 120 మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల్లో రన్‌వే దిశ, విమానాల అప్రోచ్‌కు దాని ప్రభావం తదితర అంశాలను అధ్యయనం చేస్తున్నారు. రైల్వే విద్యుదీకరణ వ్యవస్థ కారణంగా ఏర్పడే విద్యుదయస్కాంత ప్రభావాలు విమానాశ్రయ కమ్యూనికేషన్ నావిగేషన్ పరికరాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అవసరమైన సాంకేతిక రక్షణ చర్యలు రైల్వే శాఖ నుంచి అవసరమైన అనుమతులు తదితర అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంటుందని బృందం వివరించింది. ఈ సందర్భంగా ఏఏఐ సభ్యులు, సాంకేతిక బృందం చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వివరించారు. ప్రతిపాదిత ప్రాంతాలకు సంబంధించిన రెవెన్యూ సర్వే అటవీ రహదారులు రైల్వే భౌగోళిక వాతావరణ తదితర వివరాలను సాంకేతిక బృందానికి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, సిపిఓ సునీత, ములకలపల్లి తాసిల్దార్ స్వాతి బిందు, ఆర్అండ్ బి నాగేశ్వరరావు, సర్వే అధికారు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపీ రంగంలో ఎన్వీఆర్ ఆసుపత్రి మరో ముందడుగు

## ఆసుపత్రిలో ఘనంగా అడ్వాన్స్‌డ్ ఫిజియో & స్పైన్ సెంటర్ ప్రారంభం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో స్థానిక ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ ఆసుపత్రిలో అడ్వాన్స్‌డ్ ఫిజియో ఓ స్పైన్ సెంటర్ ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. లయన్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పట్టణ ప్రముఖులు పైబోయిన రఘు, దవులూరి దామోదరరావు ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఫిజియోథెరపీ, పునరావాస వైద్య సేవలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. ఈ నూతన కేంద్రం తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి చైర్మన్ నూకల బుల్లియ్య, సీఈఓ పడాల మధు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నూకల దుర్గ, డాక్టర్ అనూష గొల్ల మాట్లాడుతూ ఎన్వీఆర్ ఎమర్జెన్సీ కేర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ఫిజియో ఓ స్పైన్ సెంటర్‌లో లేజర్ టెక్నాలజీ ఫిజియోథెరపీ, రోబోటిక్ ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్, ఆర్థోపెడిక్ ఫిజియోథెరపీ, న్యూరో రీహాబిలిటేషన్, స్పోర్ట్స్ ఇంజరీ రీహాబిలిటేషన్ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వెన్నెముక, కీళ్ల సమస్యలు, నరాల సంబంధిత సమస్యలు, శస్త్రచికిత్సల అనంతర పునరావాసం తదితర సమస్యలకు ఆధునిక విధానాల్లో ఫిజియోథెరపీ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రోగులకు నాణ్యమైన చికిత్సతో పాటు త్వరితగతిన సాధారణ జీవన విధానానికి చేరుకునేలా పునరావాస సేవలను అందించనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖుల తో పాటు ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# సమన్వయంతో కదిలితే.. విజయం మనదే

## స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దిశానిర్దేశం

**తాడేపల్లిగూడెం ప్రతినిది సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకు వెళ్లాలని సూచించారు. అమలాపురం పార్లమెంటరీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ, సహాయక బృందం సభ్యులతో ఆయన అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి పరిస్థితులు, ఎన్నికల నిర్వహణ, భవిష్యత్ కార్యాచరణపై స్థానిక నాయకులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకమని చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు., ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎక్కడాసమన్వయ లోపం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవటంతోపాటు పార్టీ విధి విధానాలను వారికి వివరించి చైతన్యవంతులను చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కముందుకు వెళితే విజయాలు సొంతమవుతాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఓటరును కలిసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని, పార్టీ శ్రేణులు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు.సమష్టి కృషి, క్రమశిక్షణ, సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ఘన విజయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ కోరారు.సమన్వయమే బలం.. సమష్టి కృషే గెలుపునకు మార్గం.. విజయమే మన అంతిమ లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం న్యూస్):**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి, అమర్యా దగా ప్రవర్తించిన ఎమ్మెల్సీ లు తాతా మాధవ్, నవీన్ రెడ్డి లపై వెంటనే సస్పెన్షన్ వేటు వేయాలని దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన లో మాట్లాడుతూ.. పెద్దల సభలో ఉన్న సభ్యులు ఇలాంటి వ్యాఖ్యలు చేయ డం పార్లమెంటరీ ప్రజాస్వా మ్య విలువలకు విరుద్ధమ ని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పున రావృతం కాకుండా శాసన మండలి చైర్మన్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్ దళితుడు కావడమే ఆయనపై అను చిత వ్యాఖ్యలు చేయడాని కి కారణమా? అని ప్రశ్నించి న రమేష్ కుమార్, రాజ్యాంగ పదవుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం కలిగి ఉండాలని అన్నారు. శాసనసభ, శాసనమండలి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. సంబంధిత ఎమ్మెల్సీలపై పార్టీ పరంగానూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలను అరి కట్టి, బాధితులకు సత్వర న్యాయం, పరిహారం, పునరావాసం అందించడ మే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. జిల్లా కలె క్టరేట్‌లో నిర్వహించినజిల్లా స్థాయి అడ్వైజరీ బోర్డు సమావేశంలో వివిధ దాడు లకు గురైన 95 మంది మహిళలు, చిన్నారులకు పరిహారం అందించేందుకు కమిటీ ఆమోదం తెలిపిం ది. బాధితులకు చట్టపర మైన, వైద్య, విద్య, ఉపాధి సహాయం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదే శించారు. షీ టీమ్స్, భరోసా కేంద్రం, చైల్డ్‌లైన్ ద్వారా అవగాహన కార్యక్రమాల ను విస్తృతం చేయాలని సూచించారు.



## టీజీ టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్--2026 ఆన్‌లైన్ పరీక్ష లను పకడ్బందీగా, నిష్పక్ష పాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదే శించారు. వడ్డేపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లు, అభ్యర్థుల హాజ రు, భద్రతా చర్యలను పరి శీలించారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, పరిశీల కులు నిరంతరం పర్యవేక్షిం చాలని సూచించారు.జిల్లాలో రెండు షిఫ్టుల్లో 2,137 మంది అభ్యర్థులకు గాను 1,961 మంది హాజ రుకాగా, 176 మంది గైర్హాజ రయ్యారు. పరీక్ష ప్రశాంతం గా కొనసాగిందని అధికారు లు తెలిపారు. బుధవారం కూడా పరీక్ష కొనసాగ నుంది.




## పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలపాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్యులు, సిబ్బంది ని ఆదేశించారు.హసన్‌పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, మందుల లభ్య త, సిబ్బంది హాజరును పరిశీలించారు. రోగులకు సకాలంలో వైద్యం అందిం చాలని, షిఫ్టుల వారీగా సిబ్బంది విధులు నిర్వహిం చేలా చూడాలని సూచిం చారు. ఆసుపత్రిలో పరిశు భ్రత, మౌలిక సదుపాయాలు, నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

రానున్న వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించా రు. కలెక్టరేట్‌లో నిర్వహిం చిన సమీక్షలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ఎల క్ట్రానిక్ కాంటాలు, తేమ కొలిచే యంత్రాలు తదితర మౌలిక సదుపాయాలను సెప్టెంబర్ 25లోగా సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కల గకుండా చర్యలు చేపట్టాల ని, ప్రభుత్వం నిర్దేశించిన సన్నరకం ధాన్యాన్ని సక్ర మంగా గుర్తించి కొనుగోలు చేయాలని అన్నారు.కొనుగోలు చేసిన ధాన్యా న్ని జీపీఎస్ అమర్చిన వాహనాల ద్వారానే మిల్లు లు, గోడౌన్లకు తరలించాల ని, వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించాల ని సూచించారు.




# 22-ఏ భూములు: రైతు భూమికి స్పష్టత ఎప్పుడు

**(హెచ్.ప్రతాప్)**

భూమి రైతుకు కేవలం ఆస్తి కాదు---అది జీవనాధారం, కుటుంబ భద్రత, భవిష్యత్తుపై నమ్మకం. అందుకే ఒక భూమి 22-ఏ నిషేధిత జాబితాలో చేరినప్పుడు దాని ప్రభావం రిజిస్ట్రేషన్ ఆగిపోవడంతో ముగియదు. ఆస్తి విక్రయం, తనఖా పెట్టి రుణం పొందడం, పెట్టుబడి నిర్ణయాలు, ఆస్తి విలువ వంటి అనేక అంశాలపై అనిశ్చితి ఏర్పడుతుంది. తెలంగాణలో ప్రస్తుతం చర్చనీయాంశమైన ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా భూమి హక్కులు, పరిపాలనా సామర్థ్యం, పారదర్శకత, ప్రజా విశ్వాసం కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.నమోదు చట్టంలోని 22-ఏ నిబంధన ప్రధానంగా చట్టపరంగా బదలాయించరాని భూములు, ప్రభుత్వ భూములు, కొన్ని ధార్మిక సంస్థలు లేదా వక్ఫ్ ఆస్తులు వంటి నిర్దిష్ట వర్గాల ఆస్తుల బదలాయింపును నిరోధించేందుకు ఉద్దేశించబడింది. ఈ రక్షణ అవసరమే. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులు అనధికారికంగా చేతులు మారకుండా కాపాడటం ప్రజా ప్రయోజనమే.అయితే, అర్హత లేని ప్రైవేటు భూమి పొరపాటున నిషేధిత జాబితాలో చేరితే పరిస్థితి పూర్తిగా భిన్నం. అటువంటి సందర్భంలో నిజమైన హక్కుదారుడికి త్వరితగతిన పరిష్కారం లభించడం కూడా పరిపాలనా బాధ్యతలో భాగమే. ఇటీవల తెలంగాణలో ఇటువంటి జాబితాల్లో ప్రైవేటు ఆస్తులు చేరడంపై ఫిర్యాదులు, వివాదాలు పెరిగినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. కొన్ని సందర్భాల్లో గతంలో ప్రైవేటు ఆస్తులుగా గుర్తింపు పొందిన భూములపై కూడా అభ్యంతరాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో మొదటి అవసరం రికార్డుల స్పష్టత. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి స్వభావం, యాజమాన్య వివరాలు, నిషేధానికి కారణం, సంబంధిత ఉత్తర్వు, మార్పు జరిగిన తేదీ వంటి వివరాలను ఒకే ప్రజా వేదికలో అందుబాటులో ఉంచాలి. నిషేధిత జాబితా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండాలని కోరుతూ న్యాయస్థానంలో కూడా అంశం ప్రస్తావనకు వచ్చింది.రెండోది కాలపరిమితితో కూడిన పరిష్కార విధానం. ఒక భూమి తప్పుగా జాబితాలో చేరిందని యజమాని ఆధారాలతో దరఖాస్తు చేస్తే, దానిని స్వీకరించడం, పరిశీలించడం, నిర్ణయం తీసుకోవడం ప్రతి దశకు నిర్దిష్ట గడువు ఉండాలి. దరఖాస్తు స్థితిని ప్రజలు ఆన్‌లైన్‌లో స్వయంగా తెలుసుకునే అవకాశం కల్పిస్తే కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గుతుంది. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టినట్లు నివేదికలు చెబుతున్నాయి.మూడోది రికార్డుల సమన్వయం. భూ రికార్డులు, సర్వే వివరాలు, రిజిస్ట్రేషన్ సమాచారం, అనుమతులు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటే తప్పిదాలకు అవకాశం తగ్గుతుంది. డిజిటలీకరణ అంటే కేవలం కాగితపు రికార్డులను కంప్యూటర్‌లోకి మార్చడం కాదు; ఒకే భూమికి సంబంధించిన అన్ని అధికారిక వివరాలు పరస్పరం సరిపోలేలా చేయడం.చివరగా, భూమిని నిషేధిత జాబితాలో చేర్చే ముందు తగిన ధృవీకరణ, నోటీసు, అభ్యంతరాల స్వీకరణ వంటి ప్రక్రియలను మరింత బలోపేతం చేయవచ్చు. అదే సమయంలో ప్రభుత్వ భూముల రక్షణలో ఎలాంటి సడలింపూ ఉండకూడదు.22-ఏ జాబితా ప్రజా ఆస్తులను రక్షించే కవచంగా ఉండాలి; నిజమైన ప్రైవేటు హక్కులకు అడ్డంకిగా మారకూడదు. ఖచ్చితమైన రికార్డులు, పారదర్శక సమాచారం, వేగవంతమైన పరిష్కారం, సాంకేతిక సమన్వయం---ఈ నాలుగు బలపడితే రైతుకు భూమిపై భరోసా, ప్రభుత్వానికి పరిపాలనా విశ్వసనీయత, ప్రజలకు వ్యవస్థపై నమ్మకం మరింత పెరుగుతాయి.

# భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 8(ప్రజా వీక్షణం):**

పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగు తున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వేలో భాగంగా సర్వే అధికారులు రోవర్ పరికరాల సహాయంతో భూము లను కొలుస్తున్న విధానాన్ని, క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం హద్దులు స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించారు.బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో భూముల రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో రీ-సర్వే పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతి మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు సర్వేకు అవసరమైన సిబ్బంది పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.భూముల రీ-సర్వేలో భాగంగా ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది





సమన్వయంతో పనిచేసి ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.గ్రమంలో భూరీ-సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు రికార్డులు పత్రాలు సేకరించి భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. భూముల విషయంలో భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించా రు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూపత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు క్షేత్రస్థాయి లో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు. భూముల రీ-సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దా ర్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధి త శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు....జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ ..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో భార్యను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన భర్తకు జీవిత ఖైదు, రూ.15వేలు/- జరిమానా..నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూలి కట్టుబడి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ తెలిపారు వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో 03.03.2023న జరిగిన భార్య హత్య కేసులో నిందితుడైన తోడసం శ్యాంరావు, తండ్రి భోజ్జు, వయస్సు 25 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం,నివాసం: చిచ్చుపల్లి గ్రామం,వాంకిడి మండలం నేరం రుజువు కావడంతో గౌరవ జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఆసిఫాబాద్ జీవిత ఖైదు మరియు రూ.15,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు వివరాలు: 03.03.2023 రాత్రి సుమారు 9 గంటల సమయంలో వాంకిడి మండలం బంబారా గ్రామ శివారులో నిందితుడు తన భార్య తోడసం సంధ్యారాణితో కలిసి మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్నాడు. ఈ సమయంలో ఆమె మొబైల్ ఫోన్ రోడ్డుపై పడిపోవడంతో దానిని తీసుకునేందుకు మోటార్‌సైకిల్ నుంచి కిందకు దిగింది. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమె మృతి చెందినట్లు నిందితుడు పోలీసులను నమ్మించాడు .దీంతో తొలుత వాంకిడి పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.21/2023 U/Sec.304-A IPC కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.అయితే దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మృతురాలి తండ్రికి అందిన సమాచారం మేరకు,నిందితుడు తన భార్యను రాయితో కొట్టి హత్య చేసి,ఆ హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు పోలీసులకు అనుమానం ఏర్పడింది.పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా కొనసాగించగా, నిందితుడు తన భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడని,03.03.2023న ప్రయాణ సమయంలో ఆమెను రోడ్డు పక్కకు లాగి రాయితో కొట్టి హత్య చేసినట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి.అనం తరం ఆమె రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఇతరులను నమ్మించేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది.సాక్ష్యాధారాల సేకరణ దర్యాప్తు అధికారి బి. శ్రీనివాస్, సిఐ వాంకిడి (గతంలో) ఆధ్వర్యంలో పోలీసులు సాక్షుల వాంగ్మూలాలు, సంఘటనా స్థల పరిశీలన, నిందితుడి అరెస్ట్, నిందితుడి సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్న రక్తపు మరకలు కలిగిన రాయి, రక్తపు మరకలు ఉన్న మట్టి తదితర భౌతిక ఆధారాలతో పాటు వైద్య మరియు ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించారు.సేకరించిన సాక్ష్యాధారాలు, వైద్య మరియు శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నిందితుడు తన భార్యను ఉద్దేశపూర్వకంగా రాయితో కొట్టి హత్య చేసి, ఆమె మృతిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారణ కావడంతో U/Sec.302, 201 IPC కింద చార్జ్‌షీట్‌ను గౌరవ న్యాయస్థానంలో దాఖలు చేశారు.న్యాయస్థానం తీర్పు కేసులో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు, వైద్య ఆధారాలు, శాస్త్రీయ/ఫోరెన్సిక్ ఆధారా లు మరియు ఇతర దర్యాప్తు ఆధారాల ను సమగ్రంగా పరిశీలించిన గౌరవ జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఆసిఫాబా ద్ న్యాయమూర్తి శ్రీమతి బి. శారదా దేవి ,నిందితుడు తోడసం శ్యాంరావు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించా రు.నిందితుడికి జీవిత ఖైదు మరియు రూ.15,000/- జరిమానా విధిస్తూ గౌర వ న్యాయస్థానం తీర్పు వెలువరించి ంది.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున గౌరవ జిల్లా మరియు సెషన్స్ కోర్టు, ఆసిఫాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీ జగన్మోహన్ రావు, పి.పి శ్రీ ఎం. శ్రీనివాస్ రావు,సమర్థవంతంగా వాదన లు వినిపించారు.కేసుకు సంబం ధించిన సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సేకరించి, దర్యాప్తును పూర్తిచేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన వాంకిడి పోలీస్ స్టేషన్ దర్యాప్తు అధికారి శ్రీ బి.శ్రీనివాస్, ప్రస్తుత డిఎస్పి అశోక్ ,ప్రస్తుత సిఐ శ్రీ ఎస్. వేణుగోపాల్, ఎస్సై శ్రీ డి. మహేందర్, లైజనింగ్ ఆఫీసర్ కె. బాల్ సింగ్, సబ్ డివిజన్ సిడిఓ రాంసింగ్, అలాగే సాక్షులను సమన్వయం చేసి గౌరవ న్యాయస్థానంలో సకాలంలో హాజరుపరిచిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ నితిక పంత్ అభినందించారు.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి పునాదులు

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం

## మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇలపర్తి రామారావుకు ఘన సన్మానం

తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)

సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే పునాదులు వేస్తారని పలువురు వక్తలు సూచించారు. పెంటపాడు మండలంలోని పెంటపాడు ఎస్.టి.వి.ఎన్. హిందూ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పాఠశాల ఉపాధ్యాయుడు ఇలపర్తి రామారావును అభినందిస్తూ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ తమ బోధన, వ్యక్తిత్వం, సేవాభావంతో విద్యార్థుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ఉపాధ్యాయులు కొందరేనని తెలిపారు. సమర్థవంతమైన విద్యాబోధనతో రామారావు విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారని ప్రశంసించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఆయన సేవలకు లభించిన గుర్తింపు అని వివరించారు. మరో ముఖ్య అతిథి మండల విద్యాశాఖాధికారి డాక్టర్ పి.వి. రామకృష్ణ మాట్లాడుతూ రామారావు అంకితభావంతో పనిచేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. గత వేసవిలో కూడా విద్యార్థుల కోసం పలు గ్రామాల్లో పర్యటించి, వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర




ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు అభ్యసించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి పేరు సంపాదించారని తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు చదువు ఎప్పటికీ తరగని ఆస్తి అని అన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకున్న విద్యార్థులే సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరని వివరించారు. అవార్డు గ్రహీత ఇలపర్తి రామారావు మాట్లాడుతూ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా, గర్వకారణంగా ఉందని తెలిపారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి, విద్యా రంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని వివరించారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇలపర్తి రామారావును ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుదుళ్ల నారాయణరావు, అక్కిరిపల్లి బుజ్జి, కమలాబాయి, టీ. రవికుమార్, పి. కేశవ, నత్త విజయ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించిన అటవీ శాఖ అధికారులు...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ రేంజ్ అటవీ క్షేత్రాధికారి ఆదేశాల మేరకు, సిర్పూర్ రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్ అటవీ ప్రాంతంలో, సిర్పూర్ నుంచి ఇటిక్యాల పహాడ్‌కు వెళ్లే రహదారి పైన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించడం జరిగింది.ఈ అటవీ ప్రాంతంలో పులులతో పాటు అనేక వన్యప్రాణులు సంచరిస్తుంటాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను వన్యప్రాణులు ఆహారంగా పొరపాటున తీసుకోవడం వల్ల వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. అంతే కాకుండా, ప్లాస్టిక్ పర్యావరణాన్ని కలుషితం చేసి భావితరాలకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తుంది. కావున అటవీ ప్రాంతాల్లో ఎవరూ ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయవద్దని, ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించడం జరిగింది.అడవులను, వన్యప్రాణులను కాపాడటం ఒక్క అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదు---మనందరి బాధ్యత.ప్లాస్టిక్ రహిత అడవి... ఆరోగ్యకరమైన ప్రకృతి... సురక్షితమైన భవిష్యత్తు.అని తెలియచేశారు.



# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు వ్యాఖ్యలు తీవ్రంగా ఖండనీయం

## -- బీఆర్ఎస్ నాయకులకు ప్రజాస్వామ్యం, దళితుల పట్ల గౌరవం లేదు: డీసీసీ కార్యదర్శి వినయ్ ముదిరాజ్

బోయినపల్లి; సెప్టెంబర్ 8, (ప్రజా వీక్షణం)



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను డీసీసీ కార్యదర్శి వినయ్ ముదిరాజ్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన మండిపడ్డారు.ఈ సందర్భంగా వినయ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులకు ప్రజాస్వామ్య వ్యవస్థపై, దళితుల పట్ల కనీస గౌరవం కూడా లేదని విమర్శించారు. రాజకీయంగా విభేదాలు ఉండవచ్చుని, అయితే రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడటం సరికాదన్నారు. శాసనసభ స్పీకర్ స్థాయిని కూడా గౌరవించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ సంస్కృతిని తెలియజేస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్యంలో విమర్శలకు, అభిప్రాయ భేదాలకు అవకాశం ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వినయ్ ముదిరాజ్ పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు తమ తీరు మార్చుకోకుండా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పట్ల ప్రతి రాజకీయ నాయకుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వినయ్ ముదిరాజ్ స్పష్టం చేశారు.

# బదిలీపై వెళ్తున్న ఐసిడిఎస్ పిడి రాధామాధవికి ఘన సత్కారం

## బాపట్ల తహసీల్దార్ సలీమా ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు

బాపట్ల : సెప్టెంబర్ 8 ( ప్రజా వీక్షణం )

అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్తున్న బాపట్ల ఐ సి డి ఎస్ పి డి రాధామాధవికి బాపట్ల తహసీల్దార్ ఎస్ కె సలీమా ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.బాపట్లలో ఐసిడిఎస్ పిడిగా పనిచేసిన కాలంలో రాధామాధవి అందించిన సేవలను తహసీల్దార్ సలీమా కొనియాడారు.మహిళలు, చిన్నారుల సంక్షేమం, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె చేసిన కృషి అభినందనీయమన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించారని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు సహజమే అయినప్పటికీ, విధులు నిర్వహించిన ప్రాంతంలో తన సేవలతో మంచి గుర్తింపు పొందిన అధికారికి వీడ్కోలు పలకడం ఎప్పటికీ గుర్తుండిపోయే సందర్భమని సలీమా అన్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూడా రాధామాధవి తన అనుభవంతో సమర్థవంతంగా సేవలందించి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిడి రాధామాధవి మాట్లాడుతూ... బాపట్లలో పనిచేసిన సమయంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. సమష్టి సహకారంతోనే ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయగలిగామని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి ఆత్మీయంగా సత్కరించిన తహసీల్దార్ సలీమాకు కృతజ్ఞతలు తెలిపారు.



# తాత మధును ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవి లో ఉన్న వ్యక్తి కుల, మతా లకు అతీతంగా వ్యవహా రించాలని అన్నారు. తాత మధు ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయడంతో పాటు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వా న్ని కూడా తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశా రు. స్పీకర్‌పై వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు.కార్యక్రమంలో డిబీఎఫ్ జిల్లా అధ్యక్షురా లు బొర్ర సంపూర్ణ, నాయ కులు మాదాసి సుదర్శన్, చుంచు నరేష్, మేకల అనిత తదితరులు పాల్గొన్నారు.




# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధు వ్యాఖ్యలు ఖండనీయం: మట్టే ప్రసన్న కుమార్

బాలానగర్: సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం)



తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల్లో అభివృద్ధి చేయడంలో విఫలమై, శాసనసభలో ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై మాట్లాడే ధైర్యం లేక రాజకీయంగా అసహనంతోనే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలకు దిగుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన శాసనసభ పీఠంపై ఆసీనులైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి తాతా మధు చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీ అహంకార ధోరణికి, దళితుల పట్ల ఆ పార్టీ వైఖరికి నిదర్శనమని ప్రసన్న కుమార్ ఆరోపించారు."ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదు. రాజకీయ నాయకులు హుందాతనంతో, బాధ్యతాయుతంగా మాట్లాడాలని ఆయన సూచించారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలే తమ ఓటు ద్వారా తగిన సమాధానం చెబుతారని మట్టే ప్రసన్న కుమార్ అన్నారు."ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే రాజకీయ నాయకులు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడకుండా సంయమనం పాటించాలి. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని, తాతా మధు క్షమాపణ చెప్పాలని మట్టే ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ మరింత విస్తృతంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

# అక్టోబర్ 4న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

హనుమకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల ను అక్టోబర్ 4న నిర్వహిం చనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలి పారు.కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధు లతో కలెక్టర్ సమీక్ష నిర్వ హించారు. ఎన్నికల ప్రక్రి యను నిబంధనల ప్రకారం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వ హించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించా రు.సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, జడ్పీ సీఈవో శేషాద్రి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.



# హిందూ ఉత్సవ సమితి నూతన అధ్యక్షులుగా తాటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నిక..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ ప్రముఖ్ రంగస్వామి మార్గదర్శకత్వంలో కాగజ్‌నగర్ పట్టణ హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గ ఎన్నికలు పద్మశాలి భవనములో మంగళవారం సాయంత్రం నిర్వహించారు.ఈ సమావేశంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా తాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అరుణ్ లోయ, కోశాధికారిగా దెబ్బటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా సభ్యుందరు ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా విజయ్ యాదవ్, యెమ్మాజీ సంతోష్, దుర్గం ప్రశాంత్, అంజనేయులు గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సిద్దం శ్రీనివాస్, వినోద్, దేశ్‌ముఖ్ శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పెద్ది హరీష్, కళ్యాణ్, అనిల్ ఎన్నికయ్యారు.ముఖ్య సలహాదారులుగా ఈర్ల విశ్వేశ్వర్ రావు, దేశ్‌ముఖ్ శ్రీనివాస్, వీరభద్రచారి, శివ గౌడ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సిందం శ్రీనివాస్, డా. కొత్తపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ (డెంటింగ్) లను ఎన్నుకొఇవడం జరిగింది. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ రంగస్వామి మార్గదర్శకత్వంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఐకమత్యంతో ముందుకు సాగుతారని తెలిపారు.సమావేశంలో నాయకులు సిందం శ్రీనివాస్, యెమ్మాజీ సంతోష్, మహావీర్ ప్రసాద్ లోయా, రవీద్రచారి, వేణు,కవర్ పాల్, తౌటి అఖిల్, గుడెల్లి వంశి, కోటి, నితిన్, తదతరుల పాల్గొన్నారు.



# అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థుల భారీ ర్యాలీ





## -- బాలానగర్‌లో ఘనంగా అవగాహన కార్యక్రమం.. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్న సందేశం

**బాలానగర్ :సెప్టెంబర్ 8 ( ప్రజా వీక్షణం )**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ పరిధిలోని బాలానగర్ డివిజన్‌లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతుల్లో అక్షరాస్యత, విద్య ప్రాముఖ్యతను తెలియజేసే పలకలు, నినాదాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ అరుణ జ్యోతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ కె. వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు ఎం.హరీష్ చంద్ర, ఉపాధ్యాయు రాలు శిరీష్ తది తరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి "అందరికీ విద్య -- అంద రికీ అక్షరాస్యత", "విద్యతోనే అభి వృద్ధి", "బాలలందరూ బడిలో ఉం డాలి", అక్షరాస్యతే సమాజ ప్రగతికి పునాది" వంటి నినాదాలతో విద్యా ర్థులు ప్రజల్లో అవగాహన కల్పించారు. బాలానగర్ ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగుతూ విద్య ప్రాధాన్యతను ప్రజలకు వివరించింది. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యా యులు అరుణ జ్యోతి మాట్లాడుతూ ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అంది ంచడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అక్షరాస్యత పెరిగినప్పుడే ప్రజల్లో సామాజిక, ఆర్థిక, ఆరోగ్య పరమైన అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. పేదరి కం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివా హాలు వంటి సమస్యలను అరికట్ట డంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థుల ఉత్సాహభరిత నినాదాలతో ర్యాలీ కొనసాగడంతో స్థానికులు కూడా ఆసక్తిగా తిలకిం చారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్య తను పెంపొం దించడంతో పాటు, విద్య పట్ల తల్లిదండ్రులు, ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ జ్యోతి, ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ కె. వెంకటయ్య డ్యూటీ ఉపా ధ్యాయులతో 2026 విద్యా సంవత్స రానికి సంబంధించి బడిబాట కార్య క్రమం జూన్ 3 నుండి జూన్ 19 వరకు నిర్వహించినా కార్యక్రమంలో మంచి స్పందన వచ్చిందని అన్నారు. ముఖ్యంగా బాలనగర్ ఉన్నత పాఠశా లలో గత ఏడాది 240 విద్యార్థులే ఉండేవారని ఇప్పుడు 300 మంది వరకు విద్యార్థులు ఉన్నారని హర్షం వ్యక్తంచేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచడానికి మరి యు బడిఈడు పిల్లలను పాఠ శాలల్లో చేర్పించడానికి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతి ఏటా బడులు పునఃప్రారంభం కావడానికి ముందు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతుపేటలో వైభవంగా నూతన వధూవరుల ఆశీర్వాద కార్యక్రమం: హాజరైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్

**నందిగామ, సెప్టెంబర్ 8 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని రైతుపేటలో వివాహ వేడుక అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగింది. మాదాల వీరయ్య చౌదరి గారి కుమారుడి వివాహం ఘనంగా ముగిసిన అనంతరం, నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు ప్రముఖ రాజకీయ దిగ్గజాలు వారి నివాసానికి ప్రత్యేకంగా విచ్చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు మరియు ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న దంపతులు ఇరువురూ అన్యోన్యంగా, అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ఆయురారోగ్యాలతో కలకాలం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాదాల వీరయ్య చౌదరి కుటుంబాన్ని ఘనంగా అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, బంధుమిత్రులు మరియు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు తమ ఆశీస్సులను అందజేశారు. ఈ అభినందన సభతో రైతుపేటలో సందడి నెలకొంది.



# దేవన్నపేటలో 56 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్ ఇద్దరు నిందితుల అరెస్ట్

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట లోని ఓ రైస్‌మిల్‌లో అక్ర మంగా నిల్వ చేసి, రీప్యా కింగ్ చేస్తున్న సుమారు 56 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యా న్ని హసన్‌పర్తి పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరి ని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ ఎస్. రవి సిబ్బంది తో కలిసి పెట్రోలింగ్ నిర్వ హిస్తుండగా అందిన సమా చారంతో రైస్‌మిల్‌పై దాడి చేశారు. అక్కడ పీడీఎస్ బియ్యం నిల్వ చేసి ఉండ గా, పారిపోవడానికి ప్రయ త్నించిన ఇద్దరిని అదుపు లోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని కేశ బోయిన మొగిలి, బెజ్జంకి శ్రీనివాస్‌గా పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 1.96 లక్షల విలువైన పీడీఎస్ బియ్యంతో పాటు తూకం మిషన్, బియ్యం సంచులు కుట్టే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ. 2.07 లక్షలుగా పోలీసులు తెలి పారు. విచారణలో నింది తులు పరిసర ప్రాంతాల నుంచి సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా సేకరించి, రైస్ మిల్‌లో వాణిజ్య సంచుల్లో రీప్యాక్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న ట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసులో పరారీ లో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు కొనసాగు తోందన్నారు. పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హసన్ పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ హెచ్చరించారు.

# నందిగామలో వైఎస్సార్‌సీపీ సన్నాహక సమావేశం: స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సమాయత్తం కావాలి!






**నందిగామ సెప్టెంబర్ 08(ప్రజా వీక్షణం)**

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తం కావాలని జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. నందిగామ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సన్నాహక సమావేశానికి ఆయనతో పాటు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, పరిశీలకులు అవుతు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు రెండేళ్ల పాలనను నిరసిస్తూ 'వెన్నుపోటు పార్టీ -- వెన్నుపోటు పాలన' పోస్టర్‌ను నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహ? రావు మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించి అరాచక పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పటివరకు పట్టించుకోని సంక్షేమ పథకాలను హడావుడిగా తెరపైకి తెచ్చి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో భారీగా అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ ప్రశ్నిస్తోందని నాయకులు గుర్తుచేశారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంలో భాగంగా పార్టీ తరఫున ఒక పకడ్బందీ ప్రణాళికను ప్రకటించారు. చంద్రబాబు పాలనలోని వైఫల్యాలను ప్రజలకు వివరించడం, గత ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ చేరవేయడం, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడం, పార్టీ నాయకులు మరియు క్రియాశీలక కార్యకర్తలకు ఐడీ కార్డులు అందించడం, గ్రామ, వార్డు స్థాయిల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వంటి ఐదు కీలక అంశాలతో కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబర్ 5 నుండి 22 వరకు సంస్థాగత సమావేశాలు, సెప్టెంబర్ 12 నుండి 22 వరకు మండల, వార్డు స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 23 నుండి ఇంటింటా ప్రచారం ప్రారంభించి, ప్రతి ఇంటికీ 'వెన్నుపోటు పాలన' బుక్‌లెట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. రాబోయే మున్సిపల్ మరియు స్థానిక ఎన్నికల్లో నందిగామ నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ పూర్తి సన్నద్ధంగా ఉందని, క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సైనికులా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

## -సెప్టెంబర్ 15లోగా దరఖాస్తులు చేసుకోవాలి

## -మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 08:**




తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం ద్వారా అర్హులైన వెనుకబడిన తరగతులకు (బీసీ) చెందిన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపట్టిందని మంథని మున్సిపాలిటీ కమిషనర్ ఎన్ మనోహర్ తెలిపారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సెప్టెంబర్ 2న ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ పథకం ద్వారా పేద, నిరుద్యోగ, అర్హత కలిగిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనను పెంపొం దించడం, ఆదాయ అవకాశాలను విస్తరి ంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు ఈనెల 15 లోపు TGOBMMS వెబ్ ద్వారా దరఖాస్తు చేసుకొని మున్సిపల్ కార్యాలయం లో దరఖాస్తులు అందజేయాలని కమిషనర్ మనోహర్ కోరారు. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందినవారై, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని,గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు మించకూడదన్నారు. కుటుంబానికి ఒక్క కుట్టు మిషన్ యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారని, తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రం, టైలరింగ్ నైపుణ్య ధ్రువీకరణ వంటి పత్రాలను పరిశీలించనున్నామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## - మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ - ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై వ్యాపారులకు అవగాహన

**మంథని ప్రతినిధి ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 08 :**

ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ కోరారు. మంథని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పట్టణంలోని వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. . ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియాతో చారిత్రాత్మక పోరుకు జపాన్ జట్టు ప్రకటన



ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది.మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.



# భారత ఆర్చర్లకు 5 పతకాలు

అహ్మదాబాద్: స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ స్టేజ్-3లో భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలు సహా ఐదు పతకాలు ఖాతాలో వేసుకున్నారు. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో తోమన్ కుమార్-శ్యామ్ సుందర్ స్వామి బంగారు పతకం గెలిచారు. మంగళవారం జరిగిన ఫైనల్లో భారత ద్వయం 152-139తో ఇరాక్‌పై గెలిచింది. రికర్వ్ ఫైనల్లో హర్విందర్ సింగ్-విజయ్ సుంది 6-2తో స్లొవేకియా జోడీపై గెలిచి విజేతగా నిలిచింది.మహిళల రికర్వ్ ఫైనల్లో 0-6తో చైనా చేతిలో ఓడిన భావన-పూజ జంట రజతంతో సరిపెట్టగా.. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ డబ్ల్యూ1 విభాగంలో స్వాతి-ఆదిల్ నజీర్ కూడా ఫైనల్లో ఓడి వెండి పతకం అందుకున్నారు. డబ్ల్యూ1 వ్యక్తిగత విభాగంలో స్వాతి 6-2తో రష్యా ఆర్చర్ ఎలెనా క్రుతోవాను ఓడించి కాంస్యం గెలిచింది. కానీ, మహిళల కాంపౌండ్ కాంస్య పతక పోరులో భారత స్టార్ ఆర్చర్లు శీతల్ దేవి-పాయల్ నాగ్ .. చైనా ద్వయం చేతిలో ఓడి పతకం కోల్పోయారు.

# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.



# భారత్ ను చూసి నేర్చుకోండి

ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

# రూమర్లకు చెక్ పెట్టిన రాహుల్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ఆదర్శ కుటుంబం వాయిదా




విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఆదర్శ కుటుంబం'. ఈ కాంబినేషన్ కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అయితే గత కొన్ని రోజులుగా సినిమా రిలీజ్‌పై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. అప్‌డేట్స్ ఆలస్యం కావడంతో సినిమా అక్టోబర్ 2న విడుదల కాకపోవచ్చనే ప్రచారం జరిగింది. అక్టోబర్ 16కు వాయిదా పడుతుందనే వార్తలు కూడా వినిపించాయి. దీంతో వెంకీ అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి. ఈ రూమర్లకు నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెక్ పెట్టారు. అప్‌డేట్స్ ఆలస్యమైనందుకు అభిమానులకు క్షమాపణలు చెప్పారు. అదే సమయంలో 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తుందని స్పష్టం చేశారు. గాంధీ జయంతితో పాటు దసరా సెలవులు కూడా కలిసిరావడంతో ఈ రిలీజ్ డేట్ సినిమాకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడంతో పండుగ సీజన్‌లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. సినిమా రిలీజ్‌కు ముందు నెల రోజుల పాటు భారీ ప్రమోషనల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. దీనికి చూాఖ47వీశీత్‌ష్ట్ర అనే పేరు పెట్టారు. ప్రతి వారం కొత్త కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. నాగవంశీ వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం వచ్చే వారం ప్రారంభంలో టీజర్ విడుదల కానుంది. రెండో వారంలో ఫస్ట్ సింగిల్ రానుంది. సెప్టెంబర్ చివరి వారంలో థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేయనున్నారు. ఇవే కాకుండా ప్రతి వారం ఒక మ్యూజికల్ కంటెంట్‌ను కూడా విడుదల చేయనున్నారు. దీంతో సినిమా రిలీజ్ వరకు సోషల్ మీడియాలో బజ్ కొనసాగించేలా ప్లాన్ చేశారు.

# మోక్షజ్ఞ బర్త్ డేకి ఫ్యాన్స్‌కి ట్రీట్..

గోపీచంద్ మలినేని దర్శకత్వంలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తోన్న ఎన్‌బీకే 111 మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. గత కొంతకాలంగా ఎన్‌బీకే 111 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు తాజాగా టైటిల్ ఖరారు చేశారు. బాలయ్య కుమారుడు నందమూరి మోక్షజ్ఞ తేజ పుట్టినరోజును పురస్కరించుకుని టైటిల్‌ను రివీల్ చేశారు. బాలయ్య – గోపీచంద్ మలినేని మూవీకి దాదా అనే టైటిల్‌ను కన్ఫర్మ్ చేస్తూ మేకర్స్ పోస్టర్ విడుదల చేశారు. దీనికి సంబంధించి పోస్ట్ వైరల్ అవుతోంది. వీరశివారెడ్డి వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నందమూరి బాలకృష్ణ– గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ కావడంతో ఎన్‌బీకే 111పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు ఈ సినిమాకు టైటిల్ ఏంటన్నది మాత్రం నిర్మాతలు ప్రకటించలేదు. అయితే అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ.. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్‌బీకే 111 టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ మేరకు దాదా పేరుతో టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు. బాలయ్య స్టైలిష్‌గా ఎంట్రీ ఇచ్చారు. సూపర్‌స్టార్ కృష్ణ హిట్ మూవీ అగ్నిపర్వతంలోని పాపులర్ డైలాగ్ అగ్గి పెట్టుందా అని అడుగుతూ పూనకాలు తెప్పించారు బాలయ్య. అరేయ్ ఏరే.. నాకు గురిపెట్టడానికి ఒంటిలో పొగరు, వేలికి ట్రిగ్గరు ఉంటే సరిపోదు, బుల్లెట్స్‌కి బలుపుండాలి, గన్స్‌కి గట్స్ ఉండాలి అంటూ తన మార్క్ పంచ్ డైలాగ్‌తో అభిమానులను అలరించారు. దాదాలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలయ్యను ఢీకొట్టే పవర్‌ఫుల్ విలన్‌గా హీరో మంచు మనోజ్ కనిపించనున్నారు. మిగిలిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల పెద్దితో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ప్రముఖ నిర్మాత వెంకట సతీశ్ కిలారు తన వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై దాదా సినిమాను నిర్మిస్తున్నారు. బాలయ్య ఫేవరెట్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా.. కాంతార ఫేమ్ అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. బుర్రా సాయి మాధవ్ తన మార్క్ పంచ్ డైలాగులను రాస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న దాదా విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు. దాదా సినిమా షూటింగ్ సమయంలో నందమూరి బాలకృష్ణకు గాయం కావడంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో వచ్చే నెల నుంచి షూటింగ్‌ను తిరిగి ప్రారంభించి.. నాన్‌స్టాప్ షెడ్యూల్స్‌తో శరవేగంగా కంప్లీట్ చేయాలని గోపీచంద్ మలినేని భావిస్తున్నారు. షూటింగ్‌కు 2 నెలలే సమయం ఉండటంతో దానికి తగిన విధంగా షూటింగ్ ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు తెలిపాయి.



# నగ్నంగా నిలబెట్టేవారు..

సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్, నటి సందీపా విర్క్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత భయానకమైన దినాలను గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.6 కోట్ల మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి సందీపా విర్క్ దాదాపు నాలుగున్నర నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందీపా విర్క్.. జైలులో తాను అనుభవించిన దారుణ పరిస్థితులను, అవమానాలను బయటపెట్టారు. జైలులో ఖైదీలను తనిఖీ చేసే పద్ధతి అత్యంత అమానుషంగా ఉంటుందని సందీపా చెప్పుకొచ్చారు. లోపలికి వెళ్లగానే సిబ్బంది బట్టలు విప్పించి ప్రైవేట్ పార్టులపై టార్చ్ లైట్ వేసి తనిఖీ చేస్తారని.. చలికాలంలోనూ ఇష్టారీతిన దుస్తులు తొలగించి అవమానిస్తారని వాపోయారు. ఇంత కఠినంగా శరీరాన్ని తనిఖీ చేస్తున్నప్పుడు జైలు లోపలికి మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ ఎలా వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. జైలులో డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక రోజులోనే రెండు మూడు సార్లు దుస్తులు ఊడదీసి తనిఖీలు చేసేవారని.. ఆ వందలాది తనిఖీల సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని సందీపా విర్క్ వెల్లడించారు. "మహిళా సిబ్బందే కదా చూస్తోంది, దుస్తులు తీస్తే తప్పేంటి?" అని కొందరు తేలికగా మాట్లాడుతున్నారని సందీపా విర్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా జైలులోని ఆహారం, టాయిలెట్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండేవని.. మొదటిరోజే తనను 25-26 మంది ఉన్న గదిలో నెట్టివేశారని సందీపా విర్క్ గుర్తుచేసుకున్నారు. నిరంతం జరిగిన మానసిక వేధింపులు, ఒత్తిడి తట్టుకోలేక తాను జైలులో ఉన్న సమయంలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించినట్లు కన్నీటిపర్యంతమయ్యారు.



# 'ఫౌజీ' సెట్ లో ప్రమాదం జరగలేదు

ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా 'సీతా రామం' వంటి విజయం తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'ఫౌజీ' . ఆల్రెడీ విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. సినిమాపై పాజిటివ్ బజ్ నెలకొంది. అది పక్కన పెడితే... కొన్ని నెలల క్రితం ఈ సినిమా షూటింగ్ చేసేటప్పుడు బాలీవుడ్ నటుడు రాజేష్ శర్మను ఓ కీటకం (విష పురుగు) కుట్టడంతో అనారోగ్యానికి గురి అయ్యారని, ఆయన ఆసుపత్రి పాలయ్యారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ఆ వార్తల్లో నిజం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అసలు నిజాలను బయట పెట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రభాస్ సినిమా 'ఫౌజీ' షూటింగ్ పూర్తి చేసుకుని దట్టమైన చెట్ల మధ్య టెక్నీషియన్లతో రాజేష్ శర్మ మాట్లాడుతున్న సమయంలో ఆయన్ను ఓ కీటకం కుట్టిందని జూలై నెలలో బెంగాలీ యాక్టర్ సుదీప ఛటర్జీ తెలిపారు. అప్పట్లో అది పెద్ద సమస్యగా అనిపించలేదని, దాంతో రాజేష్ శర్మ నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. చిత్రీకరణ ముగిసిన ఆరు గంటలకు కాలులో తీవ్రమైన నొప్పి కలగడంతో కోల్‌కతాకు ప్రయాణిస్తున్న విమానంలో రాజేష్ శర్మకు విపరీతమైన జ్వరం వచ్చిందని, పరిస్థితి విషమించడంతో కోల్‌కతాలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించినట్లు సుదీప ఛటర్జీ వివరించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ఆరోగ్యంపై జరిగిన ప్రచారాన్ని రాజేష్ శర్మ ఖండించారు. తాను 'ఫౌజీ' సెట్స్‌లో అనారోగ్యానికి గురైనట్లు వచ్చిన వార్తల్లో అసలు నిజం లేదని ఆయన తెలిపారు. ఆ అంశం గురించి రాజేష్ శర్మ మాట్లాడుతూ... "అది ముమ్మాటికీ అబద్ధమే. ప్రభాస్ 'ఫౌజీ' సినిమా సెట్స్‌లో నాకు ఏం జరగలేదు. నేను అనారోగ్యానికి గురి కావడం వెనుక ప్రభాస్ కానీ, ఆయన సినిమా యూనిట్ కానీ ఎంత మాత్రం బాధ్యులు కారు. వాళ్ళందరూ మంచి వ్యక్తులు" అని చెప్పారు. హైదరాబాద్‌లో షూటింగ్ చేసిన సమయంలో తనకు ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదని, కోల్‌కతాకు వచ్చిన ఒకట్రెండు రోజుల తర్వాతే పరిస్థితి విషమించిందని... తీవ్రంగా మారిందని రాజేష్ శర్మ వివరించారు. తాను అనారోగ్యానికి గురి కావడానికి అసలు కారణం పురుగు కుట్టడం కాదని, తన కుడి కాలును చాలా కాలంగా ఇబ్బంది పెడుతున్న చర్మ సంబంధిత సమస్య అని, దాని కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకిందని రాజేష్ శర్మ వెల్లడించారు. తనకు షుగర్ (డయాబెటిస్) ఎక్కువగా ఉండటం, సమస్యను ప్రారంభంలో పట్టించుకోకపోవడం వల్ల ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువైందని ఆయన వివరించారు. సుదీప తనకు ఫ్రెండ్ అని, తప్పుడు సమాచారం అందడంతో అలా చెప్పారని పేర్కొన్నారు. అదీ సంగతి. ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని రాజేష్ శర్మ తెలిపారు. మరో వారంలో తిరిగి షూటింగ్లు చేయడం స్టార్ట్ చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# నెట్‌ఫ్లిక్స్‌లోకి త్వరలో 'విశ్వనాథ్ అండ్ సన్స్'

'వీరభద్రుడు' (తమిళంలో 'కరుప్పు') విజయం తర్వాత కోలీవుడ్ స్టార్ సూర్య కథానాయకుడిగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. ఇందులో మమితా బైజు కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలపై వచ్చిన ఈ కుటుంబ కథా చిత్రం థియేటర్లలో భారీ విజయాన్ని సాధించింది. ఇక ఇప్పుడు ఓటీటీలో విడుదలకు రెడీ అయ్యింది. ఈ వారమే స్ట్రీమింగ్ కానుంది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఇంటర్నేషనల్ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ డేట్‌ను నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. సెప్టెంబర్ 11వ తేదీ నెట్‌ఫ్లిక్స్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో థియేట్రికల్ రిలీజ్ చేశారు. ఇప్పుడు ఆ రెండు భాషలతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ స్ట్రీమింగ్ చేయనున్నారు. 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాకు మొదటి రోజు నుంచి పాజిటివ్ టాక్ లభించింది. థియేటర్లకు జనాలు భారీగా వచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు రూ. 260 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాల టాక్. సూర్య, మమితా బైజు జంటగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సీనియర్ నటి రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, సునీల్ రెడ్డి, నాజర్, హర్ష చెముడు, హారిక తదితరులు ప్రధాన పాత్రలలో కనిపించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని సమకూర్చారు. ఈ సూపర్ హిట్ ఫ్యామిలీ డ్రామా ఓటీటీ వీక్షకులను ఎంత వరకు మెప్పిస్తుందో చూడాలి.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com